ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..





'జనంవార్త'
మీ వ్యాపార, ఉద్యోగ,
రాజకీయ, వివాహ,
జన్మదిన తదితర ప్రకటనల
కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889



మేడ్చల్ | గురువారం | 25.06.2026 | సంపుటి : 1 | సంచిక : 345 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్


## నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని
# క్షమించే ప్రసక్తి లేదు

### పార్టీకి నష్టం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోం

బాధ్యత లేని నాయకులను తప్పించడానికి వెనకాడం

సర్ ప్రక్రియపై అప్రమత్తం కండి

సర్‌తో బిజెపి రాజకీయ కుట్రలకు తెరతీస్తోంది

జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు హెచ్చరిక



ఎస్ఐఆర్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులను క్షమించే ప్రసక్తి లేదని, పనిచేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోం అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. పని చేయని వారికి 10 రోజుల సమయం ఇచ్చి చూస్తాం.. లేకుంటే వారి స్థానంలో మరొకరిని నియమిస్తామని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌పై సర్పంచ్‌లతో గ్రామాల్లో ప్రచారం చేయించాలని సూచించారు.

హైదరాబాద్, జనం వార్త ప్రతినిధి: తెలంగాణలో గురువారం నుంచి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ఎస్ఐఆర్ ప్రారంభం కానుండడంతో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన జూమ్ మీటిం గ్‌లో.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్ర మార్క, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజక వర్గ ఇన్‌ఛార్జులు

మిగతా 2 లో

## తుంగభద్ర, ఆర్డీఎస్‌లపై
## సిఎం రేవంత్ సమీక్ష

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన అధికారులు

సమీక్షలో పాల్గొన్న మంత్రులు, అధికారులు

హైదరాబాద్, జూన్ 24 : జలసౌధలో తుంగభద్ర ప్రాజెక్టు, ఆర్డీఎస్, అంతర్రాష్ట్ర నదీ జల వివాదాలపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఇటీవల కర్నాటక వివిధ ప్రాజెక్టును కడుతున్నట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో తుంగభద్ర జలాల్లో మన వాటా విషయంలో

మిగతా 2 లో





## సీమకు గ్రోత్ ఇంజన్‌గా
# జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్

ఏపీలో పండని పంటలు.. దొరకని ఖనిజాలు లేవు

సీమకు పునర్ వైభవం... చరిత్ర పునరావృతం

జొన్నగిరి ఇకపై స్వర్ణగిరి

జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో సువర్ణాధ్యాయం ప్రారంభమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్సులో బంగారం వెలికితీతతో సీమకు పునర్ వైభవం రానుందని అన్నారు. బుధవారం సీఎం చంద్రబాబు కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోని జొన్నగిరిలో పర్యటించారు. జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్సులో జియో మైసూర్ - డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థలు ఏర్పాటు చేసిన గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించారు.

జొన్నగిరి, జూన్ 24 : ప్లాంట్ విస్తరణలో భాగంగా రెండో యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బంగారం శుద్ధి కోసం బంగారు ఖనిజంతో కూడిన మట్టిని తీసుకెళ్లే భారీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. మైనింగ్ జరిగే ప్రాంతంలో భారీ వాహనాలు నడిపేలా సిమ్యులేటర్ యంత్రాలపై మహిళలకు, యువతకు శిక్షణ ఇచ్చే కేంద్రాన్ని సీఎం సందర్శించారు. రూ.405 కోట్ల పెట్టుబడితో జొన్నగిరిలో జియో మైసూర్ సర్వీసెస్, డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థలు బంగారాన్ని మైనింగ్ చేసి, ప్రాసెస్ చేసి విక్రయించనున్నారు. జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్సులో తొలి ఏడాది 400 కేజీలతో మైనింగ్ ప్రారంభించి తదుపరి దశలో 900 కేజీలు,

మిగతా 2 లో

## కాంగ్రెస్ పాలనతో
# ప్రజలు విసిగిపోయారు

రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు

కెసిఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు

కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆగమైన రాష్ట్రం

జిల్లా ప్రాజెక్టులపై మంత్రుల నిర్లక్ష్యం

సత్తుపల్లి పర్యటనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




ఖమ్మం, జూన్ 24 : రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యువల్ సీఎం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సెటైర్లు వేశారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రం ఆగమవుతుందని కేసీఆర్ అనాడే చెప్పారని అన్నారు. బీఆర్ఎస్ ఓటమితో రాష్ట్రం నష్టపోయిందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి 72సార్లు ఢిల్లీ వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. బుధవారం సత్తుపల్లిలో కేటీఆర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏవర్గాన్ని వదిలిపెట్టకుండా కాంగ్రెస్ సర్కార్ వేధిస్తోందని ధ్వజమెత్తారు. సత్తుపల్లి విలేకర్లకు మండల రిపోర్టర్లుగా అక్రిడిటేషన్ జారీ చేసి

-మిగతా 2 లో..

## హాస్టల్ వాష్‌రూమ్‌లో
# యువతి ప్రసవం

కిటికీ నుంచి శిశువు బయటకు విసిరివేత

యువతిని నీలోఫర్‌కు తరలించిన సిబ్బంది



03

గోల్కొండ ప్రాంతంలో ఉన్న ఓ విద్యార్థినుల హాస్టల్‌లో ఓ విద్యార్థిని ప్రసవం తీవ్ర కలకలం రేపింది. హాస్టల్‌లో ఉంటున్న ఓ యువతి బాత్‌రూంలో ప్రసవించగా, అనంతరం నవజాత శిశువు మృతి చెందడం ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, హాస్టల్‌లో నివసిస్తున్న యువతి అకస్మాత్తుగా బాత్‌రూంలో ప్రసవించింది. అనంతరం శిశువు మృతి చెందినట్లు గుర్తించారు. శిశువు వెంటిలేటర్ ప్రాంతం నుంచి కింద పడేయడంతో మరణించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



గ్రీన్‌కార్డ్ హోల్డర్లు నేరాలు చేస్తే..
## దేశ బహిష్కరణే
అమెరికా సుప్రీం కోర్టు తీర్పు

04



## వచ్చే నెలలో ఖమేనీ అంత్యక్రియలు
మోదీకి పిలుపు

04



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88



## తెలంగాణలో విస్తరించిన
# నైరుతి

వారంపాటు జోరు వర్షాలు పడే అవకాశం

హైదరాబాద్, జూన్ 24 : నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు తెలంగాణ అంతటా విస్తరించడంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. ఈ వారం రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. వర్షాలు

-మిగతా 2 లో..

## నా మీద సోషల్ మీడియాలో
# విపరీతంగా ట్రోలింగ్

ఆడవాళ్లు రాజీకీయల్లోకి వస్తే టార్గెట్

ఇప్పటికీ ప్రపంచంలో లింగ వివక్ష : టీఆర్ఎస్ చీఫ్ కవిత

హైదరాబాద్, జూన్ 24 : రాజకీయాల్లో ఏది మాట్లాడినా తన మీద సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్ చేస్తున్నారని టీఆర్ఎస్ చీఫ్ కవిత అన్నారు. ఆడవాళ్లు రాజకీయాల్లోకి వస్తే ఇలానే టార్గెట్ చేస్తారనే భావనతోనే కొందరు కావాలనే ఈ ట్రోలింగ్స్‌కు పాల్పడుతున్నారని చెప్పారు. ఇప్పటికీ ప్రపంచంలో లింగ వివక్ష కొనసాగుతోంది. అనేక

-మిగతా 2 లో..



## తుంగభద్ర జలాల్లో
# తెలంగాణకు అన్యాయం

కర్ణాటక అక్రమ ప్రాజెక్టులతో పాలమూరు ఎడారి

ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలు కాపాడాలి

నీటి వాటాల కోసమే తెలంగాణ పోరాడి గెలిచింది

కర్ణాటక దురాగతాలను అడ్డుకోకుంటే మళ్లీ పోరాటం తప్పదు

సిఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ

హైదరాబాద్, జూన్ 24 : తుంగభద్ర జలాల్లో తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టే కుట్రలను తక్షణమే విరమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి టి. హరీశ్ రావు స్పష్టం చేశారు. తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని సీఎంకు ఆయన సూచించారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను హరీశ్ రావు విడుదల చేశారు. 'సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అతిపెద్ద అన్యాయాల్లో నీళ్ల దోపిడీ

-మిగతా 2 లో..



# నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని క్షమించే ప్రసక్తి లేదు

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. ఓటర్ల హక్కులను కాపాడటంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, దేశవ్యాప్తంగా భాజపా రాజకీయ వ్యూహాలను గమనించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే సర్ విషయంలో సీరియస్‌గా లేకపోవడం పట్ల పలువురు ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని ఆగ్రహం చెందారు సర్ పేరిట బీజేపీ కుట్ర చేస్తోందని.. అప్రమత్తంగా లేకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గంలోనే ఉంటూ మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. తనకి ఒక నియోజకవర్గం కేటాయిస్తే వెళ్లి పనిచేస్తానని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఎమ్మెల్యేలు తీరు మారితే ఒకే అని.. వారం రోజుల్లో తీరు మారకపోతే ఎమ్మెల్యేల స్థానంలో యాక్టివ్‌గా ఉన్న మరోవ్యక్తిని ఇన్‌ఛార్జిగా నియమిస్తామని సీఎం స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేయని వాళ్లు పార్టీకి అవసరం లేదని తేల్చిచెప్పారు. సర్ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. పార్టీలో ఏ పదవిలో ఉన్నా సర్ విషయంలో గ్రౌండ్ లెవల్‌కు వెళ్లి పనిచేయాల్సిందే అని అన్నారు. 'ఎవరెవరు పని చేయడం లేదో నా దగ్గర రిపోర్ట్ ఉంది.



పద్ధతి మార్చుకోకపోతే వచ్చే మీటింగ్‌లో పేర్లు చెప్పాల్సి వస్తుంది. పేర్లు చెప్పించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దని అన్నారు. ఇన్‌ఛార్జి మంత్రులు కూడా బాధ్యత తీసుకోవాలని.. పనిచేయకపోతే ఇన్‌ఛార్జి మంత్రులను కూడా మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల నిర్వహణ విషయంలో జరిగిన పరిణామాలను పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. తమకు అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికవాద ఓట్లను లక్ష్యంగా చేసుకుని కుట్రలు జరిగే ప్రమాదం ఉందని, ప్రతి అర్హత కలిగిన ఓటు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు చర్యలు తీసుకోవాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత కీలకంగా పని చేయాలని సూచించారు. సర్ ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న ఎమ్మెల్యేలపై ఫైర్ అయ్యారు. ఈ విషయంలో చాలా మంది ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటికైనా తీరు మారాలని సూచించారు. ప్రతి ఓటునూ కాపాడుకోవాలని ఆదేశించారు. లౌకికవాదుల ఓట్ల తొలగింపు కుట్ర జరుగుతోందన్నారు. గద్వాల, మల్కాజిగిరి, భువనగిరి, నిజామాబాద్‌లో వీక్‌గా ఉన్నామని చెప్పారు. మెజారిటీ ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాలకు దూరంగా ఉండడం సబబు కాదని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. ఓటు హక్కు రాజకీయాల కోసం మాత్రమే కాదని మీనాక్షి నటరాజన్ అన్నారు. జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. మనిషికి ఆక్సిజన్ ఎంత అవసరమో ఓటు హక్కు అంతే అవసరమన్నారు. ఓటు అనేది ప్రతి మనిషికి సోషల్ స్టేటస్ అని చెప్పుకొచ్చారు. ఎంతో కష్టపడితే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఓటు హక్కు వచ్చిందని తెలిపారు. ఓటు హక్కును కాపాడవలసిన బాధ్యత అందరిది అని మీనాక్షి నటరాజన్ వెల్లడించారు. జూమ్ మీటింగ్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

## తెలంగాణలో విస్తరించిన నైరుతి రుతుపవనాలు

(మొదటిపేజీ తరువాయి)

ఆలస్యం కావడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. నారు వేసుకోవడం ఆలస్యం అవుతోందని అన్నారు. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఉష్ణ పరిస్థితుల వల్ల ఈ ఏడాది కాస్త మందకొడిగా సాగిన పవనాలు.. జూన్ 8న రాష్ట్రాన్ని తాకినప్పటికీ, తెలంగాణను పూర్తిగా కమ్మేయడానికి దాదాపు 15 రోజుల సమయం తీసుకున్నాయి. ఈ ప్రభావంతో సోమవారం నుంచి మంగళవారం వరకు పలు జిల్లాల్లో రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలం కూనారంలో ఏకంగా 17.1 సెం.మీల వాన పడింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఇదే అత్యధికం కావడం విశేషం. హైదరాబాద్ వ్యాప్తంగా భారీ వర్షాలు కురవగా.. రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో వానలు దంచికొట్టాయి. వీటితో పాటు సంగారెడ్డి, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, జగిత్యాల, ములుగు, ఆదిలాబాద్ జిల్లాల్లో మంగళవారం పగటిపూట కూడా వర్షాలు ఊపందుకున్నాయి. రాబోయే బుధ, గురు, శుక్రవారాల్లో మరిన్ని భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 24న జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వానలు జోరుగా సాగనున్నాయి. ఆ మరుసటి రోజు (25వ తేదీన) ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో తీవ్రత ఎక్కువగా ఉంటుంది. 26వ తేదీన ఈ ప్రాంతాలతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ భారీ వర్షాలు కురుస్తాయని, మిగిలిన జిల్లాల్లో ఓ మోస్తరు వానలు పడతాయని అధికారులు స్పష్టం చేశారు.



## కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారు

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి సర్కార్ అన్యాయం చేసిందని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు. మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కల్లూరు మున్సిపాల్టీ బీఆర్ఎస్ గెలిచేదని.. సత్తుపల్లిలో కూడా స్వల్ప ఓట్లతో ఈ స్థానం చేజార్చుకున్నామని తెలిపారు. ఆయా ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే పార్టీ శ్రేణులు పొంగిపోకూడదని.. ఓడితే కృంగిపోకూడదని పేర్కొన్నారు. తెలంగాణ మారుమూల ప్రాంతాలు ఎక్కడకు వెళ్లినా దుర్మార్గపు కాంగ్రెస్ పాలన పోవాలని.. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ హయాంలోని మొదటి పదేళ్లు పునాది రాళ్లు వేసుకున్నామని వివరించారు. రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి జరగాలంటే కేసీఆర్ రావాలని ప్రజలే అంటున్నారని తెలిపారు. కేసీఆర్ ఓటములు, గెలుపులు చూశారని.. అనాడు తెలుగుదేశం పార్టీలో అన్నగారితో కలిసి నడిచారని ప్రస్తావించారు. అన్నదాతలకు రైతుబంధు పూర్తిగా చేయకుండా వేధిస్తోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలోనూ రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇదే ఖమ్మం జిల్లాకు, కొత్త గూడెం జిల్లాకు, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరిలోని నీటిని ఒడిసిపట్టి మొత్తం సస్యశ్యామలం కావాలి.. ఖమ్మం జిల్లా రూపు రేఖలను మార్చాలనే ప్రయత్నం కేసీఆర్ బలంగా చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ వాళ్లు జల యజ్ఞంలో భాగంగా రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ అనే రెండు ప్రాజెక్టులకు రాళ్లు వేసి పోయారు. కానీ చేసింది పెద్దగా ఏం లేదు. కానీ కేసీఆర్ ఎవరో సంబంధం లేని నాయకుల పేర్లు ఎందుకని ఆలోచన చేసి మీ జిల్లా మొత్తం తెలంగాణకు ఆరాధ్య దైవమైన భద్రాద్రి సీతారామ స్వామి వారి పేరు మీద సీతారామ ప్రాజెక్టు అని పెట్టి మన జిల్లాకు 7 లక్షల ఎకరాలకు.. కొత్తగా నాలుగురన్నర లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు.. ఎన్ఎస్‌పీల కింద కాలువల కింద ఉండే వ్యవసాయాన్ని స్థిరీకరించడానికి 2.50 లక్షల ఎకరాలకు మొత్తంగా 7 లక్షల ఎకరాలకు సాగునీరందించే బృహత్తర యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. అందులో మీ సత్తుపల్లిలో 90 వేల ఎకరాల స్థిరీకరణ 40 వేల ఎకరాలు మొత్తం కలిపి లక్షా 30 వేల ఎకరాలు సీతారామ ప్రాజెక్టు పూర్తయితే మొట్టమొదటి ఫలితం అందుకునే నియోజకవర్గం మీ సత్తుపల్లి అని కేటీఆర్ అన్నారు. ఒకటి రెండు కాదు దాదాపు 10వేల కోట్ల రూపాయలతో ప్రారంభమైంది సీతారామ ప్రాజెక్టు. అందులో 8 వేల కోట్ల రూపాయలు కేసీఆర్ ప్రభుత్వమే ఖర్చు పెట్టింది. అంటే 80 శాతం నిధులు మనం ఇప్పటికే ఖర్చు పెట్టాం. మరి ఈ రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లా మొత్తం కాంగ్రెస్‌కే గెలుపు అందించిన తర్వాత వాళ్లు మనకేం ఇచ్చారు.. ఇవాళ ఖమ్మం జిల్లా రైతులు ఆలోచన చేయాలి. జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి, రెవెన్యూ మంత్రి.. ముగ్గురు మంత్రులున్నారు. పవర్‌ఫుల్ పోర్ట్‌పోలియోల్లో ఉన్నారు.. పవర్ అంతా ఖమ్మం జిల్లాలోనే ఉందట. కానీ ఖమ్మం జిల్లా ప్రజలకు ఏం ఒరిగింది. ఖమ్మం జిల్లా రైతులకు ఏం జరిగింది.. దయచేసి మీరు ఆలోచించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.



## నా మీద సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

రంగాల్లో మగవారికే ప్రాధాన్యత లభిస్తోంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో కులాల కంటే.. మగవారి కులం, ఆడవారి కులం అనే రెండు మాత్రమే ఉన్నాయనిపిస్తోందని కవిత వ్యాఖ్యానించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో జరిగిన వేట విమెన్ ఎంపవర్‌మెంట్ సమ్మిట్‌లో మాట్లాడిన కవిత.. సమాజంలో, రాజకీయాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షపై ఆమె ఎమోషనల్ అయ్యారు. తెలంగాణ వచ్చాక పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తెచ్చుకున్నా.. ఇప్పటికీ అది పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. జీన్-జెడ్ జనరేషన్‌లోనూ అమ్మాయిలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, మహిళలు ఎదగాలని చూస్తే వెంటనే తొక్కేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఐటీ, బ్యాంకింగ్, మీడియా రంగాల్లో ఎంత సత్తా చాటుతున్నా.. పెళ్లి, కుటుంబ బాధ్యతల వల్ల మళ్లీ కెరీర్‌ను మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తోందని, అందుకే మహిళలకు ప్రభుత్వాలు, కుటుంబం, సమాజం సపోర్ట్ ఇవ్వాలని కోరారు. బాల్య వివాహాలపై కవిత షాకింగ్ గణాంకాలను బయటపెట్టారు. 2026 లో కూడా తెలంగాణ గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయని.. పె÷-లళ్లైన 15-19 ఏళ్ల మధ్యలోనే అమ్మలవుతున్న టీనేజర్ మదర్స్ గ్రామీణ ప్రాంతాల్లో 7.2 శాతం ఉంటే, హైదరాబాద్ లాంటి మహానగరంలోనే 2.7 శాతం మంది ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

## తుంగభద్ర జలాల్లో తెలంగాణకు అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

ఒకటన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను దశాబ్దాల పాటు దోచుకోవడంతో లక్షల ఎకరాలు బీడు భూములుగా మారాయి. ఆ అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి, కృష్ణా జలాలను తెలంగాణ భూములకు మళ్లించి కరవును పారద్రోలి, పాలమూరు వంటి వలసల జిల్లాలను పచ్చని పంటలతో కళకళలాడేలా చేసిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ జల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి, రాష్ట్ర ప్రయోజనా లను పక్క రాష్ట్రాల వద్ద తాకట్టు పెట్టే ప్రమాదకరమైన విధానాలను అవలంబిస్తోంది. నదుల అనుసంధానం పేరుతో గోదావరి జలాలను తమ రాష్ట్రానికి మళ్లించే ప్రయత్నం చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి సహకారం అందిస్తున్న మీరు, ఇప్పుడు తుంగభద్రపై కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల విషయంలో కూడా అదే ద్రోహ బుద్ధితో వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే మీరు, అదే ప్రాంతంలోని రైతాంగం భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న కురిడి , చిక్కాలపర్వి, చిక్కాలమంచి బ్రిడ్జ్-కమ్-బరాజ్‌లకు మీ ప్రభుత్వం సమ్మతి తెలిపిందా? 2025 జులై 18న కొడంగల్ లిఫ్ట్‌కు కర్ణాటక ఎన్‌వోసీ ఇవ్వడం వెనుక జరిగిన మతలబు ఏమిటి? ఏడాది కాలంగా కర్ణాటక అక్రమ నిర్మాణాలపై అభ్యంతరం చెప్పలేదంటే పరోక్షంగా వాటికి మీరు అనుమతించినట్లేనా? తెలంగాణ నీటిని కర్ణాటకకు తాకట్టు పెట్టే అధికారం మీకు ఎవరు ఇచ్చారని నిలదీసారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఎగువన కర్ణాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే ఆర్డీఎస్‌కు రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయన్న విషయం మీకు తెలియదా? రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతల పథకాన్ని రూ.85 కోట్లతో కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్నంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? ఇప్పటికే ఈ ప్రాజెక్టు ఇన్టేక్ నిర్మాణాలు 60 శాతం వరకు పూర్తి అయితే మీరు, మీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదా? ఈ అక్రమ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కనీసం ఒక్క లేఖ కూడా ఎందుకు రాయలేదని నిలదీసారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అనుమతులు లేకుండానే కర్ణాటక తుంగభద్రపై ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుంటే మీరు, మీ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదన్నారు. కర్ణాటక తనకు కేటాయించిన పరిమితులను దాటి అదనపు సాగు చేస్తోంది. ఆర్డీఎస్‌లో కర్ణాటక వాటా1.2 టిఎంసి మాత్రమే. కాని సగటున 5 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం రాజోలిబండ ఆనకట్టకు 100 మీటర్ల ఎగువన అక్రమంగా కర్ణాటక నిర్మిస్తున్న కురిడి లిఫ్ట్, చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే తెలంగాణ వాటా మరింత తగ్గిపోతుంది. ఆర్డీఎస్ పూర్తిగా నిర్వీర్యమయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. ఇప్పుడు కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోకపోతే ఆర్డీఎస్‌తో పాటు తుమ్మిళ్ల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. కర్ణాటక అక్రమ ప్రాజెక్టుల ప్రభావం కేవలం ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టులకే పరిమితం కాదు. తుంగభద్ర నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే ప్రవాహాలు తగ్గితే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు తాగునీటి అవసరాలు, భవిష్యత్తు నీటి ప్రణాళికలు తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా బ్రిడ్జి కం బ్యారేజీలను, ఎత్తిపోతల పథకాలను నిర్మించడానికి పూనుకుంటున్నది. స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టే ప్రతి నిర్ణయాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పాలమూరు రైతాంగం భవిష్యత్తు కోసం, తెలంగాణ జల హక్కులను కాపాడటం కోసం బీఆర్ఎస్ నిర్విరామ పోరాటం చేస్తుంది. ఎంత దూరం దాకా అయినా వెళ్లి కొట్లాడుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు.



## తుంగభద్ర, ఆర్డీఎస్‌లపై సిఎం రేవంత్ సమీక్ష

వెనక్కి తగ్గేది లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ క్రమంలో సిఎం దీనిపై సమీక్షించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణా రావు, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్,ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, ఇరిగేషన్ సెక్రెటరీ శ్రీధర్, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. తుంగభద్ర పైన నీటిపారుదల శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు..రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఎగువన కర్ణాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే ఆర్డీఎస్‌కు రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయన్న ఆందోళన నెలకొంది. రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతల పథకాన్ని రూ.85 కోట్లతో కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అనుమతులు లేకుండానే కర్ణాటక తుంగభద్రపై ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఆర్డీఎస్ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు సరిగా అందని పరిస్థితి ఉంది. కర్ణాటక తనకు కేటాయించిన పరిమితులను దాటి అదనపు సాగు చేస్తోంది. ఆర్డీఎస్‌లో కర్ణాటక వాటా1.2 టిఎంసి మాత్రమే. కాని సగటున 5 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. కర్ణాటక అక్రమ ప్రాజెక్టుల ప్రభావం కేవలం ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టులకే పరిమితం కాదు. తుంగభద్ర నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే ప్రవాహాలు తగ్గితే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు తాగునీటి అవసరాలు, భవిష్యత్తు నీటి ప్రణాళికలు తీవ్రంగా దెబ్బతింటాయి. తుంగభద్ర జలాలను కర్ణాటక ఇష్టారాజ్యంగా వినియోగించకుండా బచావత్ ట్రిబ్యునల్ అనేక నిబంధనలను కృష్ణా అవార్డులో పొందుపరచింది. అయినప్పటికీ ఆ నిబంధనలు ఖాతరు చేయకుండా, ఎటువంటి అనుమతులు లేకుండా బ్రిడ్జి కం బ్యారేజీలను, ఎత్తిపోతల పథకాలను నిర్మించడానికి పూనుకుందన్న ప్రచారం ఉంది. ప్రస్తుతం రాజోలిబండ ఆనకట్టకు 100 మీటర్ల ఎగువన అక్రమంగా కర్ణాటక నిర్మిస్తున్న కురిడి లిఫ్ట్, చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే తెలంగాణ వాటా మరింత తగ్గిపోతుంది.

## సీమకు గ్రోత్ ఇంజన్‌గా జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్

(మొదటిపేజీ తరువాయి)

జొన్నగిరిలో తవ్వకాలు జరిపి ముడి ఖనిజం నుంచి బంగారం ఉత్పత్తి చేసే ప్రక్రియను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. ఉత్పత్తి యూనిట్లోని వేర్వేరు విభాగాలను పరిశీలించారు. బంగారు బిస్కట్లు సహా వివిధ రూపాల్లోని తుది ఉత్పత్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైనింగ్ నుంచి తుది ఉత్పత్తి వరకూ జరిగే ప్రక్రియలను జియో మైసూర్ సంస్థ చైర్మన్ ప్రభాకరన్, ఎండీ నవీన్ లాల్ చంద్ర సీఎం చంద్రబాబుకు వివరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను ఉద్దేశించి ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయం మొదలైంది. ఈ సువర్ణ అధ్యాయానికి రతనాల సీమ రాయలసీమ కేంద్రమైంది. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రంగ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును లాంఛ్ చేయడం శుభపరిణామం. విస్తరణ యూనిట్ కు శంకుస్థాపన చేసుకున్నాం. ఈ ప్రాజెక్ట్ చేపట్టిన సంస్థల యాజమాన్యాలకు, ఉద్యోగులకు, కార్మికులకు అభినందనలు. జొన్నగిరి ఘనత నేటిది కాదు. ఈ ప్రాంతానికి ఎంతో చరిత్ర ఉంది. ఈ ప్రాంతాన్ని సువర్ణగిరి అని పిలిచేవారు. అశోకుడి కాలంలో ప్రసిద్ధి చెందిన ప్రాంతంగా ఉన్న సువర్ణగిరే ఈనాటి జొన్నగిరి. వందల సంవత్సరాల క్రితమే ఈ ప్రాంతం బంగారం, రత్నాలతో నిండింది. ఇక్కడకు దగ్గరలో లభించిన అశోకుడి ఎర్రగుడి శాసనాలు ఈ ప్రాంత వైభవాన్ని చెబుతున్నాయి. రాయలసీమ అంటేనే రతనాల సీమ. శ్రీకృష్ణదేవరాయుల కాలంలో సీమలో రత్నాలు రాసులుగా పోసి అమ్మేవారు. ప్రపంచానికి కోహినూర్ వజ్రాన్ని అందించిన ఘనత మన రాష్ట్రానిదే. కాలక్రమేణా రాయలసీమ ఎడారిగా మారే పరిస్థితులు తలెత్తాయి. ప్రాజెక్టులు పూర్తి చేసి, సాగునీరు ఇచ్చి సీమకు మళ్లీ జీవం పోశాం. గోల్డ్ మైనింగ్ తో సీమకు పూర్వ వైభవం వస్తుంది. ఈ ప్రాంతానికి జొన్నగిరి బదులు స్వర్ణగిరి అని పేరు పెట్టుకుందాం. 2047కు దేశాన్ని వికసిత్ భారత్ గా తయారు చేయాలన్నది ప్రధాని మోదీ కల. మన రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తయారు చేయాలన్నది నా ఆశయం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

### ఏపీ అంటే రత్నగర్భ

"ఇక్కడ గోల్డ్ మైన్ వచ్చింది. ఇక్కడి ప్రజల జీవితాలు స్వర్ణమయం కావాలి, ఈ గ్రామాన్ని దత్తత తీసుకుని స్వర్ణగిరి మోడల్ విలేజ్ గా అభివృద్ధి చేస్తారు. రాయలసీమను రతనాల సీమగా తయారు చేస్తామని చెప్పిన మాటను నెరవేర్చుకుంటున్నాం. స్వర్ణగిరి గ్రామం నుంచే ఈ ప్రణాళిక ప్రారంభం అయ్యింది. ఇక దేశమంతా స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్ గురించే మాట్లాడుతుంది. దేశం ఇప్పుడు 800 కిలోల బంగారాన్ని దిగుమతి చేసుకుంటోంది. చమురు తర్వాత ఇదే అతిపెద్ద దిగుమతి. బంగారం అంటే మనందరికీ ఎంతో మమకారం. బంగారం ఉంటే మనకు గౌరవంగా భావిస్తాం. తొలి ఏడాది 400 కిలోలు నుంచి ప్రారంభించి 50 మెట్రిక్ టన్నుల బంగారం ఉత్పత్తికి చేరుకుంటాం. ఏటా ఉత్పత్తి అయ్యే బంగారంతో విదేశాల నుంచి దిగుమతి చేసుకునే మొత్తంలో కొంత మేరైనా తగ్గుతుంది. దీంతో విదేశీ మారక నిల్వల్ని కొంత కాపాడుకోవచ్చు. స్థానిక యువతకు కూడా పెద్ద ఎత్తున ఉద్యోగాలు కూడా వస్తాయి. ఈ గోల్డ్ మైన్ ప్రాజెక్ట్ ఈ ప్రాంత అభివృద్ధికి ఒక గ్రోత్ ఇంజిన్ అవుతుంది. బంగారం ఎక్కడికో తరలించి ఆభరణాలు తయారు చేసే బదులు ఇక్కడే ఓ జ్యుయలరీ పార్కు కూడా ఏర్పాటు చేస్తాం. ఈ పరిశ్రమకు అనుమతులు, భద్రత కూడా కల్పిస్తాం. స్వర్ణగిరి నుంచి ఎయిర్ పోర్టుకు హెలికాప్టర్ ద్వారా బంగారం తరలించే ప్రాజెక్టు చేపడతాం. ఆంధ్రప్రదేశ్ అంటే అన్నపూర్ణ మాత్రమే కాదు...ఆంధ్రప్రదేశ్ అంటే రత్నగర్భ. మన రాష్ట్రంలో పండని పంటలు లేవు... దొరకని ఖనిజాలు లేవు. మంగంపేట బెరైటీస్, కడప లైమ్ స్టోన్, యురేనియం, విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ ఉంది. చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్, కుప్పంలో గ్రీన్ గ్రానైట్, శ్రీకాకుళంలో బ్లూ గ్రానైట్. గూడూరు మైకా, నెల్లూరు సిలికా, ఉత్తరాంధ్ర తీరంలో బీచ్ శాండ్. అనంతపురం, కడపలో ఐరన్ ఓర్.... కేజీ బేసిన్ లో గ్యాస్, పెట్రోల్ లభ్యమవుతాయి. ఈ వనరులను సద్వినియోగం చేసుకునేలా వాల్యూ ఎడిషన్ పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నాం. సిమెంటు, స్టీల్ పరిశ్రమలు ఏపీకి వస్తున్నాయి. ఈ గనులు, వచ్చే పరిశ్రమలతో ఇక్కడి యువతకు ఇక్కడే ఉపాధి కల్పిస్తాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కు ఏపీ ఓ మోడల్. గత పాలకులు అక్రమ సంపాదన కోసం పరిశ్రమల్ని బయటకు తరిమేశారు. కేవలం ఎన్డీఏ ప్రభుత్వ బ్రాండ్ తోనే పారిశ్రామిక వేత్తలు ఏపీకి క్యూ కడుతున్నారు. సీమలో ప్రతి జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నాం. స్పేస్, ఏరో స్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, స్టీల్, సిమెంట్, క్లీన్ ఎనర్జీ రంగాల్లో భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. కర్నూలు జిల్లాలో దేశంలో అతిపెద్ద డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నాం. ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్‌ను అభివృద్ధి చేస్తున్నాం. కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను తీసుకువస్తాం. అనంతపురంలో నాడు కియా తెచ్చాం. నేడు క్ష్ట్ర జనరేషన్ ఫైటర్ జెట్ల ప్రాజెక్టు తెచ్చాం. 2028 ఉత్పత్తి లక్ష్యంగా కడప జిల్లాలో జూలై 3న రాయలసీమ స్టీల్ ప్లాంట్ కు శంకుస్థాపన చేస్తున్నాం. కొప్పర్తి ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధి చేస్తున్నాం. తిరుపతిలో రాయల్ ఎన్ ఫీల్డ్ పరిశ్రమ తీసుకువచ్చాం. నేను రాయలసీమ బిడ్డను. రాయలసీమను రతనాల సీమగా చేస్తాం. స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్ నుంచి కొత్త చరిత్ర మొదలైంది... ఇక స్వర్ణ మయమే. అంతా కలిసి స్వర్ణాంధ్ర విజన్ 2047 కలను నిజం చేసుకుందాం."అని సీఎం చంద్రబాబు చెప్పారు..

# బీఆర్ఎస్ నేతల మాటలు నమ్మితే అధోగతే

**ఇచ్చిన హామీలు అమలు చేస్తూ పోతున్నాం**

**ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమం**

**మీడియా సమావేశంలో మంత్రులు భట్టి, తుమ్మల**



**ఖమ్మం, జూన్ 24 :** కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. ఆనాడు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరమ్మ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరలేదని గుర్తుచేశారు. బుధవారం వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతు ఆశీర్వాద సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పది సంవత్సరాలలోనే కుంగిపోయిందని భట్టి విమర్శించారు. కేసీఆర్ చేసిన అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీతో చెల్లిస్తోందన్నారు. తండ్రి, కొడుకు, అల్లుడు, కూతురు మాయమాటలతో రాష్ట్రంలో తిరుగుతున్నారని.. ప్రజలు నమ్మవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర సంవత్సరాల కాలంలో ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుతూ వచ్చామని తెలిపారు. కోటి పది లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా ఇస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు 22 వేలకోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని చెప్పారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా కింద వేలకోట్ల రూపాయలు చెల్లించామని తెలిపారు. మహిళల ఉచిత బస్సుకు 13వేల కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన 'సర్' ప్రమాదకరమైందని అన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. పోలింగ్ సిబ్బందికి సమగ్రమైన సమాచారం అందించాలన్నారు. జూన్ 30వ తేదీన మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రెండున్నర సంవత్సరాల కాలంలో రైతు భరోసాకు 36 వేల కోట్ల రూపాయలు అందించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిది అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అవసరమైన ఎరువులను అందించామని చెప్పారు. ఈ నెల 30వ తేదీన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలన్నారు. రైతులను ఆదుకోవడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్, రాష్ట్ర కళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నూత సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.




## డ్రగ్స్ నిషేధానికి నడుం బిగించాలి

**ఒలంపిక్ రన్ ప్రారంభించిన మెదక్ ఎంపి రఘునందన్ రావు**

**సిద్దిపేట, జూన్ 24 :** డ్రగ్స్ నిషేధానికి ప్రతి జూన్ 23వ తేదీన ఒలింపిక్ డేను నిర్వహిస్తున్నామని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వ్యాఖ్యానించారు. నశా ముక్త భారత్ కింద మళ్లీ ఈ ర్యాలీ చేపడుతున్నామని పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో డిగ్రీ కళాశాల మైదానంలో ఒలింపిక్ రన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు పాల్గొని మాట్లాడారు. ఈ రన్‌లో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికీ ఒలింపిక్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలను ఎండలో ఉంచడానికి తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని చెప్పుకొచ్చారు. డీ విటమిన్ కోసం ఒక ట్యాబ్‌లెట్ వేస్తున్నారు కానీ ఎండలో మాత్రం ఉంచట్లేదని తెలిపారు. యోగాతో ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. యోగా చేయడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. స్కూల్ యాజమాన్యాలు విద్యార్థులకు యోగా నేర్పించాలని సూచించారు. ఒలింపిక్స్ క్రీడలను తాము చిన్నపుడు చూసేదని.. ఇండియాకి ఎన్ని కప్పులు వచ్చాయో అని తెలుసుకునే వాళ్లమని అన్నారు. ఎప్పుడు కూడా చైనా ఒలింపిక్స్‌లో మొదటగా వచ్చేదని.. మనం మాత్రం కింది స్థానంలో ఉండే వాళ్లమని వెల్లడించారు. నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత క్రీడలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు క్రీడలు అలవాటు చేయాలని ఎంపీ రఘునందన్ రావు సూచించారు. స్వామి వివేకానంద చెప్పినట్లుగా మన దేశానికి కావాల్సింది భగవద్గీత పుస్తకాలు కాదని.. క్రీడా మైదానాలు కావాలని అన్నారు. మన దేశంలో ఉన్నా క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. సిద్దిపేటకు ఇంత పెద్ద గ్రౌండ్ ఉండటం చాలా అదృష్టమని.. విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

# రైతుబంధు విషయంలో మరోసారి దగా

**కుసుమ్ పథకంలో వేయికోట్ల మోసం**

**సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ జగదీశ్ రెడ్డి**




**హైదరాబాద్, జూన్ 24 :** రైతుబంధు విషయంలో మరోసారి మోసం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారంపై విరుచుకుపడ్డారు. వానా కాలం రైతుబంధు వేస్తామని కొత్త డ్రామా మొదలుపెట్టారని విమర్శించారు. యాసంగి మీ తాత ఇస్తాడా? అంటూ చురకలు అంటించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన రైతు బంధును సక్కగా ఇచ్చినా కూడా రూ.30 వేల కోట్లు ఇంకా తెలంగాణ రైతులకి బాకీ ఉన్నావని విమర్శించారు. తెలంగాణ రైతులు రేవంత్ రెడ్డి మోసాలను గమనించాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న సర్ కార్యక్రమం ముగిసిన తరువాత ఎన్నికలకు వెళ్లనున్న దృష్ట్యా వానాకాలం రైతు బంధు వేస్తామని నాటకాలాడుతున్నారని, వానాకాలం, యాసంగి కాలం ఇవ్వాల్సిన బాకీని ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి బ్యాంకును కూడా బ్లాక్ మెయిల్ చేసే మొనగాడని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం సాగుతున్న పాలనపై, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న సంబంధాలపై ఆయన పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమ పథకాలను పక్కనబెట్టేసిందని జగదీష్ రెడ్డి ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో స్కామ్‌లు తప్ప స్కీమ్‌లు లేవని విమర్శిస్తూ.. ముఖ్యంగా 'కుసుమ్' పథకంలో దాదాపు వెయ్యి కోట్ల రూపాయల భారీ కుంభకోణం జరిగిందని పేర్కొన్నారు. ఈ స్కామ్‌లో కొందరు పెద్దల పేర్లు వినపడుతున్నాయని, దీనిపై రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తక్షణమే సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలపై స్పందిస్తూ.. పీసీసీ చీఫ్ పదవికి ఎసరు పెడుతున్నారంటూ వ్యాఖ్యానించారు. మెట్రో ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనంటూ చేస్తున్న ప్రచారాన్ని జగదీష్ రెడ్డి తిప్పికొట్టారు. నిజానికి మెట్రో విషయంలో బీజేపీ , 'హైబ్రిడ్ కాంగ్రెస్' ఒక్కటయ్యాయనే విషయం స్పష్టంగా తేలిపోయిందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధాని మోదీతో జట్టు కట్టారని విమర్శించారు. చంద్రబాబు, మోదీ ఆలోచనల నుండి పుట్టిన ఒక క్రాస్ బ్రీడ్, హైబ్రిడ్ సీఎం ప్రస్తుతం రాష్ట్ర పాలన సాగిస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ, జాతీయ బ్యాంకులను భయపెడుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేయబట్టే.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వయంగా ఇతర కేంద్ర మంత్రులతో రేవంత్‌కు సమావేశాలు ఏర్పాటు చేయిస్తున్నారని అన్నారు. దీన్ని బట్టి చూస్తే కిషన్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డికి పీఏ లాగా పని చేస్తున్నారా? అనే అనుమానం కలుగుతోందని ఎద్దేవా చేశారు. అంతేకాకుండా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనలకు ప్రభుత్వం ఎందుకు అంతలా భయపడుతోందని ఆయన ప్రశ్నించారు. జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణలో పార్టీ ఆఫీస్ ఏర్పాటు చేయడంపై జగదీష్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ తెలంగాణలోనే కాదు, దేశంలో ఎక్కడైనా తమ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని అన్నారు. ఇందులో కొత్తగా ఆఫీస్ పెట్టడం ఏముందని, ఆయన ఎప్పటి నుంచో ఇక్కడే ఉన్నారు కదా అని గుర్తుచేశారు. గతంలో తెలంగాణ వచ్చినందుకు నిరసనగా 11 రోజులు అన్నం తినకుండా పవన్ కళ్యాణ్ చేసిన దీక్ష కూడా తెలంగాణలోనే జరిగిందని పేర్కొన్నారు. ఇక్కడి తిండితోనే వాళ్ల శరీరం నిర్మాణం అయిందని వ్యాఖ్యానించారు. చివరగా.. పవన్ కళ్యాణ్, మోదీ, చంద్రబాబు, రేవంత్ రెడ్డి.. వీరందరూ ఒకే కూటమిగా, ఒక్కటిగానే పనిచేస్తున్నారని జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు.

## సర్ ప్రక్రియలో పేరు తొలగింపు

**రేషన్ నిరాకరణపై సుప్రీం ఆశ్చర్యం**

**న్యూఢిల్లీ, జూన్ 24 :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నుంచి తొలగించబడిన వారికి రేషన్ నిరాకరిస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఎస్ఐఆర్‌లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా అంటూ సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఇది రాష్ట్ర పరిధిలోని ప్రత్యేక కారణాలతో కూడిన అంశం కాబట్టి.. ఆర్టికల్ 32 కింద నేరుగా సుప్రీంకోర్టుకు రాకుండా ముందుగా కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్. ప్రసన్న తన పిటిషన్‌ను ఉపసంహరించుకుని హైకోర్టుకు వెళ్లేందుకు అనుమతి కోరారు. రేషన్ నిరాకరణ వివాదంపై కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తూ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన వెకేషన్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది.

## హాస్టల్ వాష్‌రూమ్‌లో యువతి ప్రసవం

- కిటికీ నుంచి శిశువు బయటకు విసిరివేత
- యువతని నీలోఫర్‌కు తరలించిన సిబ్బంది

**హైదరాబాద్, జూన్ 24 :** గోల్కొండ ప్రాంతంలో ఉన్న ఓ విద్యార్థినుల హాస్టల్‌లో ఓ విద్యార్థిని ప్రసవం తీవ్ర కలకలం రేపింది. హాస్టల్‌లో ఉంటున్న ఓ యువతి బాత్‌రూంలో ప్రసవించగా, అనంతరం నవజాత శిశువు మృతి చెందడం ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, హాస్టల్‌లో నివసిస్తున్న యువతి అకస్మాత్తుగా బాత్‌రూంలో ప్రసవించింది. అనంతరం శిశువు మృతి చెందినట్లు గుర్తించారు. శిశువు వెంటిలేటర్ ప్రాంతం నుంచి కింద పడేయడంతో మరణించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే శిశువు మృతికి గల ఖచ్చితమైన కారణాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఘటనలో మరో ముఖ్యమైన అంశం యువతి గర్భవతి అనే విషయం హాస్టల్ సిబ్బందికి తెలియకపోవడం. హాస్టల్‌లోనే ఉంటున్న విద్యార్థిని గర్భవతి అయినప్పటికీ ఎవరూ గుర్తించలేకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. దీనిపై కూడా పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. యువతిని చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. మరోవైపు, శిశువు మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించే ఏర్పాట్లు చేశారు. ఘటనతో హాస్టల్‌లోని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. యువతి గర్భానికి, శిశువు మృతికి దారితీసిన పరిస్థితులపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా యువతి బావ పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

## ఒంటరి దివ్యాంగురాలిపై అత్యాచారం

**దుండగుడి కోసం పోలీసుల గాలింపు**

**హైదరాబాద్, జూన్ 24 :** నగరంలోని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన వెలుగుచూసింది. ఇంట్లో ఒంటరిగా ఉన్నదివ్యాంగురాలిపై ఓ దుర్మార్గుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధితురాలికి మాట్లాడే, వినికిడి శక్తి లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని ఈ దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మహిళ మెడ, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ఎల్బీనగర్ పోలీసులు రంగంలోకి దిగారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా, నిందితుడిని పట్టుకునేందుకు ఆ ప్రాంతంలోని సీసీటీవీ దృశ్యాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సీసీ ఫుటేజి ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేశామని, త్వరలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు

## నిజామాబాద్‌లో అనూహ్యఘటన

**కస్టమర్‌లాగా వచ్చి కారుతో ఉడాయింపు**

**నిజామాబాద్,జూన్24 :** కారు కిరాయకు మాట్లాడుకున్న వ్యక్తి డ్రైవర్ దిగి అరటి పళ్లు తెచ్చేలోగా రారుతో ఉడాయించాడు. ఈ ఘటన నిజామాబాద్‌లో జరిగింది. రోడ్డు పక్కన కారు ఆపి అరటి పళ్లు తెచ్చేలోపే కారు మాయమైన సంఘటన నిజామాబాద్ పట్టణంలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. కుద్రిత్ బేగ్ అనే వ్యక్తి కారు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎప్పటి లాగే కిరాయి కోసం పట్టణంలోని చెన్నై షాపింగ్ మాల్ వద్దనున్న అడ్డా వద్ద కారును నిలిపాడు. ఈ క్రమంలో ఓ వ్యక్తి వచ్చి నాందేడ్‌కు వెళ్లాలని కుద్రిత్ బేగ్ కారును రూ.4 వేలకు కిరాయికి కుదుర్చుకున్నాడు. కారు గాంధీ చౌక్ వద్దకు రాగానే సదరు కస్టమర్ అరటి పండ్లు తెమ్మని డ్రైవర్ కుద్రిత్ బేగ్‌ను కోరాడు. కారు పక్కకు ఆపి అరటి పండ్లు తీసుకుంటుండగా కిరాయి కుదుర్చుకున్న వ్యక్తి కారుతో పరారయ్యాడు. మోసపోయానని గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## వర్షాకాలంలో పోలీసులకు ఆసరా

**రెయిన్‌కోట్లు పంపిణీ చేసిన కమిషనర్**

**రామగుండం,జూన్24 :** రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. వర్షాకాలంలో విధి నిర్వహణకు ఉపయోగపడే రెయిన్‌కోట్లను కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎండనకా, వాననకా రాత్రింబవళ్లు కష్టపడి విధులు నిర్వహించే సిబ్బందికి అత్యవసర పరిస్థితుల్లో రెయిన్‌కోట్లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. విధి నిర్వహణ సమయం లో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి సమర్థవంతంగా బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కె.శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శేఖర్,మల్లేశం,రమేష్ పాల్గొన్నారు.

## మాడ్గులపల్లి మండలం స్కూళ్లలో ప్రీప్రైమరీ తరగతులు

**నల్లగొండ, జూన్ 24 :** మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల, పాములపాడు, చర్లగూడెం ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం ప్రీ ప్రైమరీ తరగతులను ఎంఈఓ సీహెచ్ వెంకటమ్మ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను విజయవంతంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. 3 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఈ ప్రీ-ప్రైమరీ తరగతులు అందుబాటులో ఉంటాయి. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎం భిక్షం, జీహెచ్‌ఎం పద్మావతి, ఆగా మోత్కూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వై.వినోద్ కుమార్, చర్లగూడెం హెచ్‌ఎం నిరంజన్ రెడ్డి, పాములపాడు హెచ్‌ఎం వెంకన్న, ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు, ఏఏపీసీ చైర్మన్ నాగలింగమ్మ, చర్లగూడెం ఉప సర్పంచ్ జ్యోతి, కార్యదర్శి అశోక్, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## బాల్క సుమన్‌కు హైకోర్టులో ఊరట

**షరతులతో కూడా బెయిల్ మంజూరు**



**హైదరాబాద్,జూన్24 :** సింగరేణి సంస్థ మరియు దాని యాజమాన్యంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు తెలంగాణ హైకోర్టు ఊరటనిచ్చింది. గతంలో ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీయ డంతో సింగరేణి యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుమన్‌పై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయస్థానం ఆయనకు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం బాల్క సుమన్‌కు రూ. 25 వేల వ్యక్తిగత బాండ్‌తో పాటు, ఇద్దరి పూచీకత్తు సమ ర్పించాలనే నిబంధనపై బెయిల్ లభించింది. వివాదాస్పద వ్యాఖ్యల కేసులో అరెస్ట్ భయం లేకుండా ఈ బెయిల్ నిర్ణయం ఆయనకు పెద్ద ఉపశమనాన్ని కలిగించింది. కోర్టు విధించిన నిబంధనలకు కట్టుబడి ఉండాలని, దర్యాప్తునకు సహకరించాలని ఈ సందర్భంగా స్పష్టం చేయడం జరిగింది.

## డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తి

**వారం రోజులపాటు జైలు శిక్ష విధించిన కోర్టు**

**నిజామాబాద్,జూన్24 :** మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి కోర్టు ఏడు రోజుల సాధారణ కారాగార శిక్ష విధించిందని ఐదవ టౌన్ ఎస్సై సునీల్ వెల్లడించారు. స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టిన సమయంలో షేక్ హబీబ్ అనే వ్యక్తికి బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించగా అతడు మద్యం తాగి వాహనం నడుపుతున్నట్లుగా నిర్ధారణ అయినట్లు ఎస్సై వివరించారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి బుధవారం ప్రత్యేక జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా కోర్టు శిక్ష విధించిందని వెల్లడించారు. కోర్టు ఆదేశాల మేరకు సదరు నిందితుడిని నిజామాబాద్ సెంట్రల్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు డ్రైవ్ చేయవద్దని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.



## రేణుక ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు

**ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి**

**నల్లగొండ, జూన్ 24 :** శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆకాంక్షించారు. నల్లగొండ జిల్లా కనగల్ మండలం ధర్వేశిపురంలో బుధవారం ఆలయ బ్రహ్మోత్సవాల్లో మంత్రి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కల్యాణోత్సవం సందర్భంగా దేవాలయం నుండి కల్యాణ మండపం వరకు మంత్రి మేళతాళాలతో ఊరేగింపుగా పట్టు వస్త్రాలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులతో కలిసి శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి జమదగ్ని మహర్షి వారి దివ్య కల్యాణ మహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ పద్మ, ఎంపీడీఓ వేద రక్షిత, ఆలయ చైర్మన్ వెంకట్ రెడ్డి, ఈఓ నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేశ్ పాల్గొన్నారు.



## నల్లగొండకు సిటీ బస్సు సర్వీసులు

**లాంఛనంగా ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి**

**నల్లగొండ, జూన్ 24 :** నల్లగొండలో సిటీ బస్సు సేవలను రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. పట్టణంలోని మహిళలు షాపింగ్, ఇతర అవసరాల కోసం రాకపోకల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని సిటీ బస్సు సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే మెడికల్ కాలేజీ విద్యార్థులు ఆస్పత్రికి చేరుకోవడానికి ఆటోలపై ఆధారపడాల్సి వచ్చేదని, ఇకపై వారు సిటీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉంటుందని చెప్పారు. బుధవారం కోటి 20 లక్షల రూపాయలతో చేపట్టనున్న నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ, ఆధునికీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తొలుత 2 సిటీ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సిటీ బస్సు సర్వీసులు చెరువుగట్టు-ఎస్ఎల్‌బీసీ మార్గంతో పాటు ధర్వేశిపురం నుండి దుప్పలపల్లి వరకు నడిచేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. నల్లగొండకు అదనంగా 30 బస్సులు కేటాయించడం జరిగిందని, 56 మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఎస్ఎల్‌బీసీ వద్ద పెట్రోల్ పంపు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, రెస్టారెంట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. బస్టాండ్ విస్తరణలో భాగంగా కొత్త కౌంటర్లు, వెయిటింగ్ గా÷-డ్గ÷న్, బాత్రూంలు, టాయిలెట్లు, ఆధునిక ఎ÷-లాట్‌ఫారాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ పనుల కోసం అదనంగా రూ.5 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. పట్టణ అభివృద్ధికి రూ.83 కోట్ల రూపాయలతో తాగునీటి శుద్ధి (వాటర్ ఫిల్టర్) వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు, పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్ది మోడల్ సిటీగా రూపొందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కురిసిషా ఖాన్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక ఆర్థిక శాఖ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి, కార్పొరేటర్ కవిత, రమేశ్, లైజన్ ఆఫీసర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

# అయోధ్య రామయ్యా.. ఏమిటీ అపచారం!



**అందరి బంధువయ్యా.. అయోధ్య రామయ్యా అంటూ పాడుకునే హిందువులకు అయోధ్య అన్నా, రాముడన్నా విడదీయరాని బంధం ఉంది. ఎవరికి వారు అయోధ్య రాముడు తమవాడని భావిస్తారు. అందుకే అయోధ్య ఆలయ నిర్మాణం కోసం ఏళ్లుగా ఎదురు చూశారు. కోట్ల రూపాయలు ఆలయం కోసం విరాళంగా ఇచ్చారు. ఇంతటి పవిత్ర కార్యక్రమం జరిగి, ఆలయ నిర్మాణం పూర్తయిన తరవాత ఇప్పుడు నిధుల దారిమళ్లింపు గోల అందరినీ కలచి వేస్తోంది. నిజంగానే ఇది ఘోరమైన అపచారంగానే భావించాలి. రాముడిని నమ్మి భక్తులు భక్తితో సమర్పించిన కానుకులను కాజేస్తే ఎలా? రాముడి తిరిగొచ్చాడంటూ.. దేశవ్యాప్తంగా జరిగిన సంబరాలను అప్పడే మరచిపోలేదు.**

అయోధ్య రామాలయానికి భక్తులు సమర్పించిన విరాళాలు, కానుకల నిర్వహణలో భారీ అక్రమాలు జరిగినట్లు వెల్లడయ్యింది. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం విరాళాల సొమ్ము చోరీకి గురైనట్లు బలమైన ఆధారాలను కనుగొంది. దీనికి సంబంధించిన ప్రాథమిక నివేదికను త్వరలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు సిట్ సమర్పించనుంది. కొన్ని రోజులుగా అయోధ్యలో సిట్ బృందం ముమ్మరంగా విచారణ జరిపింది. ఆలయ హుండీల నుంచి సేకరించిన నగదును లెక్కించే సమయంలో సీసీటీవీ ఫుటేజ్‌పై చేతివాటం ప్రదర్శించినట్లు దర్యాప్తులో తేలింది. కొన్ని కీలకమైన సీసీటీవీ దృశ్యాలను కావాలనే డిలీట్ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నా యి. భక్తులు సమర్పించిన బంగారం, వెండి, వజ్రాభరణాల ను నకిలీ వాటితో మార్చేసారనే ఆరోపణలపై సిట్ లోతుగా విచారించింది. నిర్లక్ష్యంతో పాటు దీని వెనుక పెద్ద కుట్ర కోణం దాగి ఉందనే దిశగా అధికారులు దర్యాప్తు సాగిస్తున్నారు. అయోధ్య రామాలయానికి రోజూ పెరుగు తున్న భక్తుల తాకిడి చూసి.. పులకిస్తున్న మనసులు ఇంకా పూర్తిగా తేరుకోలేదు. ఇంతలోనే మహాపచారం జరిగిపోయిందన్న వార్త కలవరపెడుతోంది. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో సమర్పిస్తున్న విరాళాలు, కానుకలు మాయమయ్యా యన్న ఆరోపణలు అయోధ్యలో కలకలం రేపాయి. మొదట్లో ఇవి ఉట్టి ఆరోపణలే అని భావించిన వారు కూడా..తర్వాత సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించడంతో అంతా దిగ్భ్రమకు గురయ్యారు. చివరకు సిట్ ప్రాథమిక విచారణలో అడుగు దగునా నిర్లక్ష్యం నిజమేనని బయటపడటం.. సీసీ టీవీ ఫుటేజ్‌లో మార్పులు.. అన్నీ కలిసి రామభక్తుల మనోభావాల్ని తీవ్రంగా దెబ్బతీశాయినే చెప్పాలి.

ఎంతో భక్తితో, నమ్మకంతో, విశ్వాసంతో రాముడి ఆలయానికి ఉపయోగపడతాయనే ఉద్దేశంతో ఇచ్చిన విరాళాలు కొందరు స్వార్థపరుల చేతిలోకి వెళ్లిపోయాయని, ఆలయ వ్యవహారాలు చూసే ట్రస్టే.. కంచే చేను మేసిన చందంగా వ్యవహరి స్తోందని తెలిసి.. భక్తులు నిర్ఘాంతపోతున్నారు. దీనిపై పెద్దగా ప్రచారం రాకుండా చూస్తున్న తీరు ఇంకా కలచివేస్తోంది. ఐదు వందల సంవత్సరాల తర్వాత రామాలయం కొలువుదీరిందని ఓవైపు భక్తులో సంతోషప డుతుంటే.. మరోవైపు ఆలయంలో జరిగిన నిధుల గోల్‌మాల్ వ్యవహారం హిందువుల మనోభావాలను దెబ్బతీసే వ్యవహారంగానే చూడాలి. మొదట్లో నిధులు దారిమళ్లాయనే ఆరోపణలు వచ్చినప్పుడు.. వాటిని రాజకీయ ప్రేరేపితంగా కొట్టిపారేసే ప్రయత్నం జరిగింది. కానీ భక్తుల నుంచి అభ్యంతరాలు రావడంతో.. యూపీ సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించింది. యోగి ఆదిత్యనాథ్ కూడా ఈ విషయంలో సీరియస్‌గానే ఉన్నట్లుగా కనిపిస్తోంది. సిట్ దర్యాప్తులో అన్నీ తెలుస్తాయని, కొంచెం ఓపిక పట్టాలని ఆయన చేసిన విజ్ఞప్తిని బట్టి తెలుసుకోవచ్చు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే..వచ్చేయేడు యూపి ఎన్నికలకు ముందు జరిగిన ఈ వ్యవహారం యోగా ప్రభుత్వానికి మచ్చలాంటిదే. మరోవైపు రాముడి పేరు చెప్పి.. పెద్ద మొత్తంలో సొమ్ము స్వాహా చేశారని ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయి. వచ్చే ఏడాది యూపీ ఎన్నికల తరుణంలో..రామాలయంలో నిధుల గోల్‌మాల్ వ్యవహారం..సంచలనం సృష్టిస్తోంది. ఈ భారీ అక్రమాలకు సంబంధించి సిట్ ఇప్పటివరకు ట్రస్ట్ అధికారులు, మేనేజ్‌మెంట్ సిబ్బంది, బ్యాంక్ ఉద్యోగులతో సహా దాదాపు 150 మందిని ప్రశ్నించింది. ట్రస్ట్ కార్యనిర్వాహకుడు అనిల్ మిశ్రా, కన్స్ట్రక్షన్ ఎయిడ్ గోపాల్ రావు పాత్రలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ కూడా ప్రస్తుతం నిఘా నీడలో ఉన్నారు. లెక్కింపు పక్రియలో పాల్గొన్న ఎస్‌బీఐ, టీసీఎస్‌లకు చెందిన ఆరుగురు ఉద్యోగుల ను కూడా ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో తిన్ను యాదవ్ అనే వ్యక్తితో పాటు కొందరు బ్యాంక్ సిబ్బందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యే అవకాశం ఉంది. భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో సమర్పించే నగదు, బంగారం, వెండి, ఇతర ఖరీదైన విరాళాలు అక్రమార్కుల భోజ్యం అయినట్టు దర్యాప్తు సంస్థ గుర్తించింది. ముఖ్యంగా ఇంత ప్రతిష్టాత్మకమైన పెద్ద ఆలయ నిర్వహణలో ముఖ్య విభాగాలు నిర్వహించే అధికారులు, ఉద్యోగులకు జవాబుదారీతనం లేకపోవడం, వారిపై పర్యవేక్షణ, నిఘా లోపించడం, సీసీటీవీ ఫుటేజీలు అదృశ్యం కావడం దర్యాప్తు సంస్థను ఆశ్చర్యపరిచింది.

ట్రస్ట్‌కు చెందిన కీలక అధికారులు దర్యాప్తు పూర్తయ్యే వరకు అయోధ్య విడిచి వెళ్లకూడదని సిట్ ఆదేశించింది. ఆలయ నిర్వహణలో పారదర్శకత కోసం కాశీ విశ్వనాథ్ ఆలయం తరహాలోనే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నియమించాలని, ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణను పెంచాలని సిట్ సూచించనుంది. అలాగే విరాళాల లెక్కింపునకు బ్యాంకులు కేవలం రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే నియమించాలని, క్రమం తప్పకుండా ఆడిటింగ్ నిర్వహించాలని నివేదికలో సిఫార్సు చేయనున్నట్లు చెబుతున్నారు. అయోధ్య విరాళాలపై ఏర్పడిన వివాదంపై యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ స్పందించారు. ప్రజలు 15 రోజులు ఆగాలని కోరారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులు ఎవరైనా, ఎంతటివారైనా వదిలిపెట్టబోమంటూ హామీనిచ్చారు. మొత్తంగా రాముడి పేరు చెప్పి నిర్వాహకులే టోపీ పెట్టడం ఇప్పుడు తీవ్ర చర్చగా మారింది.

# ఉక్రెయిన్‌లోకి భారత్ దళాలు

## వాన్స్ ప్రతిపాదనను కొట్టేసిన ట్రంప్



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన వెంటనే ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ముగించేందుకు విస్తృత ప్రయత్నాలు చేశారు. ఇందుకోసం అగ్రరాజ్య సర్కారు అనేక ప్రతిపాదనలు రూపొందించింది. ఒక దశలో భారత బలగాలను కదనరంగంలోకి శాంతిదూతలుగా పంపించాలని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సూచించారు. అయితే, దీన్ని ట్రంప్ కొట్టిపారేశారు. తాజాగా విడుదలైన ఓ పుస్తకంతో ఈ కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. 'రెజీమ్ ఛేంజ్' పేరుతో ప్రముఖ రచయితలు మ్యాగీ హాబర్‌మాన్, జొనాథన్ స్వాన్ రాసిన పుస్తకం జూన్ 23న విడుదలైంది. ఇందులో ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపు కోసం అమెరికా సర్కారు చేసిన ప్రయత్నాలను ప్రస్తావించారు. ఆ పుస్తకం ప్రకారం. అగ్రరాజ్య అధ్యక్షుడిగా రెండోసారి ట్రంప్ ప్రమాణస్వీకారం చేసిన పది రోజుల తర్వాత ఓవల్ ఆఫీసులో కీలక సమావేశం జరిగింది. ఆ భేటీలో ఉక్రెయిన్-రష్యాకు ప్రత్యేక రాయబారిగా ఉన్న రిటైర్డ్ ఆర్మీ లెఫ్టినెంట్ జనరల్ కీత్ కెలాగ్.. యుద్ధం ముగింపునకు ఓ ముసాయిదా ప్రణాళికను సమర్పించారు. యుద్ధ క్షేత్రంలో విదేశీ సైనిక దళాలను ఉపయోగించి కాల్పుల విరమణను పర్యవేక్షించే ఏర్పాట్లు చేయాలని ప్రతిపాదించారు. ఫ్రాన్స్, బ్రిటన్, నెదర్లాండ్స్ వంటి ఐరోపా దేశాల నుంచి శాంతి పరిరక్షణ దళాలను పంపించే ప్రణాళికను పేర్కొన్నారు. అయితే, దానికి ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అభ్యంతరం తెలిపారు. నాటో సభ్య దేశాలకు చెందిన సైనిక బలగాలను ఉక్రెయిన్‌లోకి పంపితే.. అది రష్యాను రెచ్చగొట్టినట్లే అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. దానివల్ల ఉద్రిక్తతలు మరింత పెరగడంతో పాటు.. అమెరికా ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొనాల్సిన పరిస్థితి తలెత్తుందని అంచనా వేశారు. ఈ క్రమం లోనే ప్రత్యామ్నాయ మార్గాలను ఆలోచించిన వాన్స్.. ఐరోపాయే తర దేశాల బలగాలను పంపించొచ్చని పేర్కొన్నారు. భారత్, సౌదీ అరేబియా దేశాల పేర్లను ఆయన ప్రతిపాదించారు. కాగా.. వాన్స్ ప్రతిపాదనలను అధ్యక్షుడు ట్రంప్ తోసిపుచ్చినట్లు ఆ పుస్తకంలో పేర్కొన్నారు. "భారత ప్రధాని మోదీతో నాకు బలమైన అనుబం ధం ఉంది. ఆయన నన్ను ఎంతగానో ఇష్టపడతారు. కానీ, భారత్ ఎప్పటికీ దీనికి అంగీకరించదు. ఇలాంటి విషయాల్లో జోక్యం చేసుకుని మూల్యం చెల్లించుకోవాలని అనుకోదు" అని నాడు ట్రంప్ అన్నట్లు తాజా పుస్తకంలో వివరించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీరును కూడా ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకించారట. ఆయనో అసమర్థ నేత అని, అమెరికా నుంచి నిధులు పొందుతూ కూడా.. సొంత దేశాన్ని నాశనం చేసుకుంటున్నారని నాడు జెలెన్‌స్కీపై మండిపడినట్లు తెలిసింది.

# అత్యవసరమైతే తప్ప ఇరాన్‌కు ప్రయాణం వద్దు

## భారత్ అడ్వైజరీ




**న్యూఢిల్లీ :** అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం ముగింపు ప్రకటనతో పశ్చిమాసియాలో ఇప్పుడిప్పుడే ఉద్రిక్తతలు చల్లారుతున్నాయి. ఈ నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత ఎంబసీ తమ అడ్వైజరీని సవరించింది. అయితే, ఇరాన్‌లో పరిస్థితులు కాస్త మెరుగుపడినప్పటికీ.. ప్రస్తుతానికి ఈ దేశానికి అనవసర ప్రయాణాలు మానుకోవాలని భారత పౌరులకు సూచించింది. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. "ఇరాన్‌లోని భద్రతా పరిస్థితులను ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తున్నాం. ప్రస్తుతం ఇక్కడ సానుకూల పరిణామాలు నెలకొంటున్నాయి. అయినప్పటికీ ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నాం. స్థానిక పరిస్థితులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు అధికారులు జారీ చేసే సూచనలను కచ్చితంగా పాటించాలి. ఇక, తదుపరి నోటీసులు ఇచ్చేంతవరకు ఇరాన్‌కు అనవసర ప్రయాణాలు చేయొద్దు. అనివార్య కారణాల వల్ల ఈ దేశానికి రావాలనుకునేవారు ఎంబసీ అధికారులను సంప్రదించి మీ వివరాలను నమోదు చేసుకోండి. ఎంబసీ సోషల్ మీడియా ఖాతాలు, అధికారిక వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు ఫాలో అవుతూ ఉండండి" అని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం ముగింపునకు సంతకాలు జరిగినప్పటికీ.. హర్మూజ్ నిర్వహణ, అణు కేంద్రాల పరిశీలన వంటి అంశాల్లో రెండు దేశాల మధ్య భేదాభిప్రాయాలు నెలకొన్నాయి. బాంబు దాడుల్లో దెబ్బతిన్న అణు కేంద్రాల్లో తనిఖీల కోసం అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (ఐఏఈఏ) ఇన్‌స్పెక్టర్లను అనుమతించేందుకు ఇరాన్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఆయన ప్రకటనను ఇరాన్ ఖండించింది. మరోవైపు, హర్మూజ్‌ను మూసేశామని టెహ్రాన్ చెబుతుండగా.. అది తెరిచే ఉందని అమెరికా అంటోంది. ఈ గందరగోళం నడుమ పశ్చిమాసియాలో ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

# కుప్పకూలిన గోదాం.. శిథిలాల కింద 30 మంది



**కోల్‌కతా :** కోల్‌కతాలోని తారాతలా ప్రాంతంలో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఓ మూడు అంతస్తుల గోదాం కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. శిథిలాల కింద 30 మందికిపైగా చిక్కుకున్నట్లు సమాచారం. వీరిలో ఇప్పటివరకు పది మందిని రక్షించగా.. మిగతావారిని వెలికి తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ నిర్మాణంలో భారీ ఇనుప స్తంభాలు వాడడంతో సహాయక చర్యలు కష్టంగా మారాయి.

# ఆ రోజంతా ఏడ్చా.. సువేందు ధైర్యం చెప్పారు

## ఎంపీ మహువా



**పశ్చిమ బెంగాల్ :** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటు న్నాయి. ఇప్పటికే పెద్ద సంఖ్యలో టీఎంసీ ఎమ్మెల్యేలు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. టీఎంసీ నేతల ఫిరాయింపుల వేళ ఆ పార్టీ ఎంపీ మహువా మొయిత్రా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకుటున్నాయి. జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మహువా బెంగాల్ సీఎం సువేందు అధికారిని ప్రశంసించారు. పార్టీల గురించి పక్కనపెడితే సువేందు అధికారితో తనకు మంచి అనుబంధం ఉందని అన్నారు. టీఎంసీలో ఉన్న సమయంలో అనేక విషయాల్లో ఆయన తనకు అండగా నిలిచారని పేర్కొన్నారు. 2014 ఎన్నికల్లో తనకు లోక్‌సభ టికెట్ దక్కనప్పుడు తాను ఎంతో బాధపడ్డానని మొయిత్రా పేర్కొన్నారు. రోజంతా ఏడ్చానని.. ఆ సమయంలో సువేందే ధైర్యం చెప్పారని గుర్తు చేసుకున్నారు. 2016 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాను నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మద్దతిచ్చారన్నారు. అయితే, భాజపాలో చేరిన తర్వాత సువేందును మళ్లీ కలవలేదన్నారు. కానీ, ఆయన చేసిన సాయాన్ని తాను ఎప్పటికీ మర్చిపోనన్నారు. టీఎంసీ విషయంలో మమతా బెనర్జీ చేయలేని పని సువేందు చేశారని.. పార్టీ పట్ల నిబద్ధత లేని నేతలు ఎవరో ఆయన వల్లే తమకు తెలిసిందని పేర్కొన్నారు. ఇందుకు ఆయనకు కృతజ్ఞతలు చెప్పారు. సొంతంగా గెలిచే సామర్థ్యం లేని వారిని కూడా పార్టీలోకి తీసుకోవడం వల్లే నేడు టీఎంసీ ఈ స్థితికి చేరిందని ఆమె అభిప్రాయపడ్డారు. మమతకు ఎంతో నమ్మకస్తురాలిగా పేరున్న మహువా.. సువేందును ప్రశంసించడంతో ఆమె కూడా పార్టీ మారనున్నారనే ఊహాగానాలు బెంగాల్ రాజకీయ వర్గాల్లో జోరందుకున్నాయి.



# వచ్చే నెలలో ఖమేనీ అంత్యక్రియలు

## మోదీకి పిలుపు

**న్యూఢిల్లీ :** అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో మృతిచెందిన ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు వచ్చే నెలలో జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని భారత ప్రధాని నరేంద్ర మోదీని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు దౌత్య వర్గాలు బుధవారం వెల్లడించాయి. అయితే, దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటనేదీ రాలేదు. జులై 5 నుంచి 9 వరకు ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమం జరగనుంది. తొలుత టెహ్రాన్, ఖోమ్ పట్టణాల్లో అంతిమ సంస్కారాలకు సంబంధించి కొన్ని కార్యక్రమాలు చేపట్టనున్నారు. 9వ తేదీన ఖమేనీ స్వస్థలం మషాద్‌లో ఆయనను ఖననం చేయనున్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ యుద్ధం ప్రారంభమైన తొలి రోజే ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో జరిపిన దాడిలో 86 ఏళ్ల అలీ ఖమేనీ, మరో 40 మంది అత్యున్నత సైనికాధికారులు మృతి చెందారు. ఖమేనీ కుటుంబంలో కుమార్తె, అల్లుడు, కోడలు, మనవరాలు మృతి చెందగా.. కుమారుడు మొజ్తాబా కూడా గాయపడినట్లు వార్తలు వచ్చాయి. అలీ ఖమేనీ మరణంతో.. మొజ్తాబాను సుప్రీం లీడర్‌గా ఎన్నుకొన్న సంగతి తెలిసిందే.



# ఇదో చెత్త డేటా

## భారత సుంకాలపై నాడు ట్రంప్ ఫైర్

**వాషింగ్టన్ :** రెండోసారి అధికారం చేపట్టిన అనంతరం ట్రంప్ భారత సుంకాల విషయంలో సొంత యంత్రాంగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికాపై భారత్ విధించే సుంకాలను తక్కువ చేసి చూపినందుకు వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాజాగా విడుదలైన 'రెజీమ్ ఛేంజ్' పుస్తకంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. పుస్తకంలోని వివరాల ప్రకారం.. ట్రంప్ అధికారం చేపట్టిన వెంటనే విదేశాలు తమ దేశంపై విధించే సుంకాల వివరాలను అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం ట్రంప్ ముందు ఉంచింది. ఆ గణాంకాల్లో భారత్.. అమెరికాపై విధించే సుంకాలు తక్కువ మొత్తంలో ఉన్నట్లు చూపించడంతో ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ కనీసం 175 శాతం సుంకాలు విధించిందని వాదించారు. భారత్, చైనాలు.. అమెరికాపై ఎంత సుంకాలు విధిస్తున్నాయనే కచ్చితమైన గణాంకాలు తెలియజేయకుండా చెత్త డేటాను ఇస్తున్నారని ట్రంప్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని వివరించడానికి లుట్నిక్ ప్రయత్నించగా.. అదంతా తప్పుడు డేటా అని కొట్టిపడేశారు. విదేశాలపై భారీ సుంకాలను విధించడానికి ట్రంప్ సలహాదారులు నివేదికలు రూపొందిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

**భారత్‌పై సుంకాలు..** అమెరికా ఎగుమతులపై భారత్ అధిక సుంకాలు విధిస్తోందని ట్రంప్ పలుమార్లు ఆరోపించారు. అనంతరం ఇరుదేశాల మధ్య జరిగిన వాణిజ్య చర్చల్లోనూ ప్రపంచ దేశాలన్నింటిలో భారత్ మాత్రమే తమపై అధికంగా సుంకాలు విధిస్తోందని మండిపడ్డారు. ఈ విషయంపై ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో సైతం పలుమార్లు భారత్‌పై విమర్శలు చేశారు. అనంతరం ట్రంప్ భారత్‌పై భారీగా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే.



# గ్రీన్‌కార్డ్ హోల్డర్లు నేరాలు చేస్తే.. దేశ బహిష్కరణే

## అమెరికా సుప్రీం కోర్టు తీర్పు

**వాషింగ్టన్ :** డిపోర్టేషన్ (దేశ బహిష్కరణ) విషయంలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువడింది. నైతిక దుష్ప్రవర్తనకు పాల్పడితే శాశ్వత నివాసితులు, గ్రీన్‌కార్డు హోల్డర్లు అయినా సరే దేశం నుంచి బహిష్కరించేలా ప్రభుత్వానికి ఉన్న అధికారాలను యూఎస్ సుప్రీం కోర్టు సమర్థించింది. అయితే ఆ కేసుల్లో ఆ నేరం జరిగి ఉండొచ్చని నమ్మడానికి బలమైన కారణం ఉన్నట్లు అధికారులు నిర్ధరించాల్సి ఉంది. నేరారోపణలు ఎదుర్కొంటున్న శాశ్వత నివాసితులు, గ్రీన్‌కార్డ్ హోల్డర్లకు ఎంట్రీ పాయింట్ల వద్దే అమెరికాలో ప్రవేశానికి నిరాకరించేలా ఈ తీర్పు అనుమతిస్తోంది. దేశం నుంచి డిపోర్ట్ చేయడానికి బోర్డర్ ఏజెంట్ల అధికారాలకు మరింత బలం చేకూరుస్తోంది. నకిలీ ట్రేడ్‌మార్క్‌కు సంబంధించి గ్రీన్ కార్డ్ హోల్డర్ అయిన చైనా జాతీయుడు మక్ చోయ్ అభియోగాలు నమోదయ్యాయి. దాంతో 2012లో అతడు చైనా నుంచి అమెరికాకు తిరిగిరాగా.. దేశంలోకి ప్రవేశించేందుకు అధికారులు నిరాకరించారు. తర్వాత కఠిన షరతులతో ప్రవేశానికి అనుమతించారు. తర్వాత తాను తప్పు చేసినట్లు మక్ చోయ్ అంగీకరించాడు. దాంతో అతడిని దేశం నుంచి బహిష్కించేలా ఆదేశాలు జారీ అయ్యాయి. తాను చేసిన నేరం నైతిక దుష్ప్రవర్తన కిందికి కాదని అతడు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. కానీ అతడికి యూఎస్ సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది.



## బోగారంలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి**

**బోగారం, జూన్ 24 (జనంవార్త) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని బొగారంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కౌకుట్ల జీవన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళలు హార్దికంగా అభివృద్ధి చెందాలని ధ్యేయంతో అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాచాని మల్లేష్, రామ్‌చాటి జానకిరామ్,దాసరి బాలకృష్ణ, భూపతి, చి.మహేందర్,దుర్గం రాజు,శ్రీను,మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆత్మగౌరవం భంగం కలిగించే విధంగా ఉచిత చీరల పంపిణీ : ఎమ్మెల్యే కృష్ణారావు

- ఉచిత చీరల పంపిణీకి ఐరిస్ పరీక్షలు అవసరమా...?
- మహిళల చీరల పంపిణీలో కాంగ్రెస్ నాయకుల విపరీత చేష్టలు



**కూకట్‌పల్లి, జూన్ 24, (జనం వార్త) :** మహిళలకు అందజేస్తున్న ఉచిత ఇందిరమ్మ చీరల పంపిణీలో కాంగ్రెస్ నాయకులు మహిళల ఆత్మగౌరవం భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎమ్మెల్యే నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచితంగా అందజేస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాలలో కాంగ్రెస్ నాయకులు విపరీత చేష్టలు చేస్తున్నారని విమర్శించారు. చీరల పంపిణీ కార్యక్రమాలలో కాంగ్రెస్ నాయకులు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారన్నారు. మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగే విధంగా చీరల పంపిణీ కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎక్కడ ఉప ఎన్నికలు ఉంటాయో, ఎక్కడ వారికి అనుకూలంగా ఉంటారో అక్కడ పంపిణీ చేస్తున్నారే తప్ప నిరుపేద మహిళలందరికీ ఉచిత చీరలు అందడం లేదని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ చర్యలను ఏ విధంగా సమర్థించుకుంటుదని ఆయన ప్రశ్నించారు...? మహిళలందరికీ ఉచిత చీరలు అందే విధంగా చీరలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చే ఉచిత చీరల కోసం మహిళల ఆత్మ గౌరవాన్ని కించపరిచే విధంగా వ్యవహరించకూడదని ఆయన కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు.



## రాజకీయ సహచరుడి పాడే మోసిన ఎమ్మెల్యే

**మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ ఆకస్మిక మృతి**

**కూకట్‌పల్లి, జూన్ 24, (జనం వార్త) :** మాజీ కౌన్సిలర్ సిహెచ్ సత్యనారాయణ ఆకస్మికంగా మరణించడంతో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆయన నివాసానికి వెళ్లి సత్యనారాయణ పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మోతి నగర్ లో నిర్వహించిన సత్యనారాయణ అంతిమయాత్రలో ఎమ్మెల్యే కృష్ణారావు పాల్గొని పాడే మోసి అంతిమ వీడ్కోలు పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యనారాయణ నాకు రాజకీయ సహచరుడే కాక చిరకాల మిత్రుడన్నారు. సత్యనారాయణ రాజకీయ జీవితంలో మోతి నగర్, అవంతి నగర్ తోట అభివృద్ధికి విశేష కృషి చేశాడన్నారు. ఈ అంతిమయాత్రలో కూకట్ పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ కోఆర్డినేటర్ సతీష్ ఆరోరా, మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్, మందాడి శ్రీనివాసరావు, ఆవుల రవీందర్ రెడ్డి, మాధవరం రంగారావు, ముద్దం నరసింహ యాదవ్, పగుడాల బాబురావు, సబిహా గౌసుద్దీన్, మాజీ కౌన్సిలర్ మక్కల నర్సింగరావు, సీనియర్ నాయకులు వీరారెడ్డి, కృష్ణారెడ్డి, అంబటి శ్రీనివాస్, తిరుపతి, ఐలయ్య, సత్యం, పాతూరు గోపి, బొట్టు విష్ణు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పల్లవి మోడల్ స్కూల్ స్టెల్లర్ 17వ ఫౌండర్స్ డే

**ముఖ్య అతిథిగా పాల్గొన్న బ్రిగేడియర్ సంజయ్ మొహంతి**

**మేడ్చల్ :** పల్లవి మోడల్ స్కూల్ -- (అల్వాల్ ) ఇన్వెస్టిచర్ వేడుక బుధవారం ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగింది. ఈ వేడుకకు గౌరవ అతిథిగా డిపిజిఓఎస్ చైర్మన్, ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య హజర్ కాగా, ముఖ్య అతిథిగా బ్రిగేడియర్ సంజయ్ మోహంతి హాజరయ్యారు. అలాగే, విశిష్ట అతిథిగా బ్రిగేడియర్ సి.పి శ్రీరామ్ లు హాజరయ్యారు. మొక్కలకు నీరు పోసి, ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. బోర్డు పరీక్షల్లో అగ్రశ్రేణి ఫలితాలు సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ విద్యాధరి రావు తన ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. నిజమైన నాయకత్వం వినయంతో, బాధ్యతతో, ధైర్యంతో నిలబడటంలో ఉంటుందని గుర్తుచేశారు. అలాగే, అద్భుత ఫలితాలను సాధించడంలో భాగస్వాములైన అన్ని స్టేక్ హోల్డర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇన్వెస్టిచర్ వేడుక విద్యార్థులను బాధ్యతాయుత నాయకులుగా తీర్చిదిద్దగా, టాపర్ల సత్కారం కృషి, క్రమశిక్షణ ఫలితాలను చూపించింది. ప్రతి విద్యార్థి కలలు కనడం, నాయకత్వం వహించడం, విజయాన్ని సాధించాలని అతిథులు ప్రోత్సహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**నాగారంలో ఇందిరమ్మ చీరల పంపిణీ**



**నాగారం, జూన్ 24 (జనం వార్త) :** మహిళల ఆర్థిక బలోపేతానికి, సంక్షేమం కోసమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని నాగారం డివిజన్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్,మామిళ్ల నారాయణ కాలనీ,ఎస్.సి కమ్యూనిటీ హాల్ లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివిజన్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాజీ కౌన్సిలర్లతో కలిసి అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేద,మధ్యతరగతి మహిళలకు ఉపయోగపడే సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ గూడూరు అశోక్ గౌడ్,మాజీ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు,సతీష్ గౌడ్,వెంకట్ రెడ్డి, పంగ సంతోష్,సత్యం సాగర్,నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.



# చెట్ల కొమ్మలను నరికివేసి.. వదిలేశారు

**జిహెచ్‌ఎంసి, విద్యుత్ శాఖ మధ్య సమన్వయ లోపమే..**



**నాగారం, జూన్ 24, (జనంవార్త) :** విద్యుత్ అంతరాయానికి ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలను విద్యుత్ శాఖ సిబ్బంది కొమ్మలను నరికివేసి రోడ్లపై వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నాగారం డివిజన్ పరిధి లోని ఎస్.వి నగర్ కాలనీ రోడ్డు నెంబర్ ఒకటిలో విద్యుత్ శాఖ సిబ్బంది పది రోజుల క్రితం చెట్ల కొమ్మలను నరికివేసి వదిలేశారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కొట్టి వేసిన చెట్ల కొమ్మలను తొలగించకుండా రోడ్డు ప్రక్కన వదిలివే



యడంతో కొమ్మలు ఎండకు ఎండిపోయి,వర్షానికి తడిసి వ్యర్థాలుగా మారి స్థానిక ప్రజలు అనారోగ్యానికి గురి అవుతున్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది చెట్ల కొమ్మలను నరికివేసి చేతులు దులుపుకున్నారని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. జిహెచ్‌ఎంసి విద్యుత్ శాఖల మధ్య సమన్వయం లోపంతోనే ఇలా జరుగుతున్నదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నరికి వేసిన చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# కెపిహెచ్‌బిలో ప్లాట్ ఫామ్ 65 హోటల్ పై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

- ఫ్రీజర్లలో పాచిపోయి కంపు కొడుతున్న ఆహార పదార్థాలు
- కిచెన్ ప్రాంగణంలో బొద్దింకలు, ఎలుకల సైర్యవిహారం
- హోటల్ లైసెన్స్‌ను తక్షణమే రద్దు చేయాలని ఉన్నతాధికారులకు సిఫార్సు
- హోటల్ నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు జారీ




**కూకట్‌పల్లి, జూన్ 24, (జనం వార్త) :** కెపిహెచ్‌బి కాలనీలోని జాతీయ రహదారికి ప్రక్కనే ఉన్న ప్లాట్ ఫామ్ 65 హోటల్ పై బుధవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. అధికారుల తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయట పడ్డాయి. హోటల్ లోని ఫ్రీజర్లలో పాచిపోయి కంపు కొడుతున్న ఆహారాన్ని నిల్వ ఉంచడమే కాకుండా వెజ్, నాన్-వెజ్ పదార్థాలను ఒకేచోట మూతలు లేకుండా ఉంచడం, ఫ్రిజ్లో ఉన్న చికెన్, మాంసం దుర్గంధ పూరిత వాసనలు రావడానికి అధికారులు గుర్తించారు. కిచెన్ ప్రాంగణంలో బొద్దింకలు, ఎలుకలు విచ్చలవిడిగా సంచరిస్తుండటం, డ్రైనేజీలు ఆహార వ్యర్థాలతో పూడుకుపోయి దుర్గంతపూరిత వాసనలు వస్తున్నాయి. హోటల్ కిచెన్ ప్రాంగణాన్ని పరిశీలించిన ఫుడ్ సేఫ్టీ అధికారులు హోటల్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస పరిశుభ్రత పాటించని ప్లాట్ ఫామ్ 65 హోటల్‌కు హైజీన్ రేటింగ్‌లో 110 మార్కులకు గానూ కేవలం 40 మార్కులు మాత్రమే వచ్చి నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు. నిబంధనల ప్రకారం 50శాతం కంటే తక్కువ మార్కులు రావడంతో సదరు హోటల్ నిర్వాహకులకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అంతే కాకుండా హోటల్ ఆహార భద్రత లైసెన్స్‌ను తక్షణమే రద్దు చేయాలని ఉన్నతాధికారులకు ఫుడ్ సేఫ్టీ అధికారులు సిఫార్సు చేశారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా అధికారులు హోటల్ నిర్వాహకులకు హెచ్చరించారు.





# ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు అందిస్తాం

**కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్**

**మేడ్చల్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కానుక' చీరల పంపిణీ కార్యక్రమం గుండ్లపోచంపల్లిలో వైభవంగా జరిగింది. గుండ్లపోచంపల్లి 299 డివిజన్ పరిధిలోని డ్వాక్రా భవన్ ఆవరణలో బుధవారం స్థానిక మహిళలకు చీరలను పంపిణీ చేశారు. గుండ్లపోచంపల్లి 299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మహిళలకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా సాయిపేట శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క మహిళకు ఇందిరమ్మ చీరలను అందిస్తామని స్పష్టం చేశారు. పేద, మధ్యతరగతి మహిళల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో



తాము ఎల్లప్పుడూ ముందుంటామని ఆయన పేర్కొన్నారు. తమకు చీరలు అందడం పట్ల స్థానిక మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 299 డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుంద భానుచందర్, కావాలి భాస్కర్, ఉదయ్ గౌడ్, సంపత్ గౌడ్, సాయిపేట మల్లేష్, షబ్బీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## దేశ భవిష్యత్తు, పార్టీ భవిష్యత్తు యువత చేతుల్లోనే : బండి రమేష్



**కూకట్ పల్లి,జూన్ 24(జనంవార్త) :** భారతదేశ భవిష్యత్తు, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు నేటి యువత చేతుల్లోనే ఉందని టీపీసీసీ ఉపాధ్యక్షులు,రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ అన్నారు. బుధవారం కెపిహెచ్ బి కాలనీ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సలీం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పార్టీకైనా యువతే వెన్నుముకలా నిలుస్తుందన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే నాయకులకు, కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. స్థానిక నాయకులు స్థానికంగా ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాహుల్ గాంధీని ప్రధాని చేయాలనే ప్రధాన లక్ష్యంతో నాయకులు, కార్యకర్తలు, సైనికుల్లా శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర ఇన్ ఛార్జ్ భవ్య, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి రమ్య,యువజన విభాగం మేడ్చల్ జిల్లా ఇన్ ఛార్జ రాంప్రసాద్, యువజన విభాగం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బొమ్మక అజయ్ తదితరులు పాల్గొన్నారు.



## సువర్చల ఆంజనేయస్వామి కళ్యాణం..

**సికింద్రాబాద్ :** తాడు బందు వీరాంజనేయస్వామి ఆలయం లో బుధవారం ఆలయ ఈవో నరేందర్ ఆధ్వర్యంలో శ్రీ సువర్చల ఆంజనేయ స్వామి వారి కళ్యాణం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆలయ అర్చకులు సత్యనారాయణ స్వామి,శంకర్ రావు స్వామి లు, ఎంతో వైభవంగా స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. ఈ నేపథ్యం లో ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించారు , ఆలయ ఈవో నరేందర్ కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు ,సదా కేశవ రెడ్డి దంపతులు ఏ జ్యోతి ఉభయ దాతలుగా వ్యవహరించారు. అంతకుముందు ఆలయంలో ఉన్న హనుమాన్ దీక్షాపరులు సామూహికంగా అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం రామనామ స్మరణతో మార్మోగింది. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు , ఆలయ సిబంది, హనుమాన్ దీక్షపరులు, భక్తులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజులు దోపిడీ అరికట్టాలి

- "బి" కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలి
- డొనేషన్ల పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తే కళాశాలలను సీజ్ చేయాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్

**హైదరాబాద్ :** రాష్ట్రంలోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాల అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యను పూర్తిగా వ్యాపారమయంగా మార్చారని, యాజమాన్యకోట సీట్లను లక్షలాది రూపాయలకు అమ్ముకుంటూ విద్యా వ్యాపారం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిమాండ్ ఉన్న కోర్సు సీట్లకు ఇష్టానుసారంగా భారీగా ఫీజులు పెంచుతున్నారని, సీట్లను బ్లాక్ లో పెడుతూ మెరిట్ విద్యార్థులకు ఇవ్వకుండా లక్షల రూపాయల ఫీజులు కట్టేవారికి సీట్లు అమ్ముకుంటున్నారని ధ్వజమెత్తారు. కొన్ని కోర్సులకు విపరీతమైన డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ఆ సీట్లకు అడ్మిషన్ల కొరత సృష్టించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయల ఫీజులు రాబడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్య పేదవారికి అందే అవకాశం లేకుండా పోతుందని, ఇంజనీరింగ్ కళాశాలలు యాజమాన్య సీట్ల భర్తీలో భారీగా అక్రమాలు చేస్తున్నాయని, అనేక ఇంజనీరింగ్ కళాశాలలు నిబంధనలు పాటించడం లేదని మండిపడ్డారు. కొన్ని కళాశాలలు టిఏఎఫ్ఆర్సి నిర్ణయించిన ఫీజుల కంటే అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, అనేక కళాశాలలు విద్యార్థులను వారి తల్లితండ్రులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా బౌన్సర్లను పెట్టుకొని ఫీజులపై ప్రశ్నిస్తే దాడులు చేయిస్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల ఫీజుల దోపిడీ పై ఉక్కుపాదం మోపాలని, యాజమాన్య సీట్లను లక్షల రూపాయలకు అమ్ముకుంటున్న కళాశాలలపై ఏసిబి, ఐటి దాడులు నిర్వహించాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.




## ప్రభుత్వ స్థలాల పరిరక్షణే ధ్యేయం

**తహసీల్దార్ మథిన్**

**జవహర్ నగర్ :** ప్రభుత్వ స్థలాల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నామని కాప్రా మండల తహసీల్దార్ మతిన్ స్పష్టం చేశారు. జవహర్ నగర్ లోని వివిధ ప్రాంతాలలో వెలసిన పలు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. కాప్రా మండల తహసిల్దార్ మథిన్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ బుధవారం జవహర్ నగర్ లోని సర్వే నంబర్లు 497, 211 లలో అక్రమంగా నిర్మించిన షట్టర్లను, వికలాంగుల కాలనీలో బేస్మెంట్ లను జెసిబి సహాయంతో కూచివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన కూల్చివేతలు చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించే వారిపై పోలీస్ కేసు నమోదు చేసి జైలుకు పంపి ఎందుకు సైతం వెనకాడబోమని హెచ్చరించారు.



## పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో
# సరికొత్త అధ్యాయం

- జొన్నగిరిలో బంగారంగని ప్రాజెక్టుకు శ్రీకారం
- ప్రైవేట్ రంగంలో బంగారం గనుల తవ్వకం ప్రారంభం
- తొలి ఏడాదిలో 400 కిలలో బంగారం ఉత్పత్తి లక్ష్యం
- సుమారు 700మందికి ఉద్యోగావకాశాలు
- రాయలసీమ అభివృద్ధికి కీలకమని ప్రకటించిన చంద్రబాబు

**కర్నూలు, జూన్ 24 :** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలో బంగారంగని ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ప్రారంభించారు. అనంతరం రెండో యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్ తదితరులు పాల్గొన్నారు. జొన్నగిరి ప్రాజెక్టుకు జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దక్కన్ గోల్డ్‌మైన్స్ లిమిటెడ్ సంస్థలు ఇప్పటి వరకు రూ.405 కోట్లు వెచ్చించాయి. ప్రయోగాత్మకంగా చేసిన ఉత్పత్తి పక్రియ విజయవంతం కావడంతో వాణిజ్యపరంగా బంగారం ఉత్పత్తి చేసే పక్రియను సీఎం ప్రారంభించారు. ప్రైవేటు రంగంలో బంగారం గనుల తవ్వకం, ఉత్పత్తి చేసే పక్రియ ప్రారంభం కావడం దేశంలోనే ఇది మొట్టమొదటిసారి. ప్రపంచంలో బంగారం గనులు, ఉత్పత్తి కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో ఒకటిగా జొన్నగిరికి అంతర్జాతీయ గుర్తింపు లభించనుంది. ఏటా రెండు టన్నుల బంగారాన్ని ఉత్పత్తి చేసేలా జియోమైసూర్ సంస్థ ప్రణాళికలు రచించింది. ఇక్కడ 700 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఉత్పత్తి చేసిన బంగారం విలువపై నాలుగుశాతం రాయల్టీ లభించనుంది. తొలి ఏడాది 400 కేజీల బంగారాన్ని ఉత్పత్తి చేయనున్న నేపథ్యంలో సుమారు రూ.57 కోట్లు రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది. ఈ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు కర్నూల్ జిల్లాలో ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ ఏపీ ఆర్థికాభివృద్ధిని పరుగులు పెట్టించడంలో అత్యంత కీలక పాత్ర పోషించనుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మైనింగ్ ప్రాజెక్ట్ ద్వారా రాయలసీమ ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం కావడంతో పాటు, స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఏపీలో పారిశ్రామిక వృద్ధికి, మైనింగ్ రంగానికి ఈ ప్రాజెక్ట్ ఒక కొత్త దిక్సూచిగా మారి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడనుంది. జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగానికి గేమ్ ఛేంజర్‌గా మారబోతోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పెట్టుబడులు, ఉత్పత్తి లక్ష్యాలు, ప్రత్యేకతల వివరాలు ఈవిధంగా ఉన్నాయి. ఏడాదికి 400 కేజీల బంగారు ఉత్పత్తితో మైనింగ్ ప్రారంభం కానుంది. తదుపరి కాలంలో దీనిని ఏడాదికి 900 కేజీలకు పెంచుతారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలోకి వచ్చాక ఏడాదికి ఏకంగా 2 టన్నుల బంగారం ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా స్థానికులకు కేవలం ఉపాధి కల్పించడమే కాకుండా, వారిని నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారు. మైనింగ్ జరిగే ప్రాంతంలో వాడే అత్యంత భారీ వాహనాలను సురక్షితంగా నడిపేందుకు వీలుగా 'సిమ్యులేటర్ యంత్రాల' సహాయంతో స్థానిక మహిళలకు, యువతకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణా కేంద్రాన్ని సీఎం చంద్రబాబు స్వయంగా సందర్శించి, అభినందించారు. అనంతరం సీఎం చంద్రబాబు జెండా ఊపి ఖనిజంతో కూడిన మట్టిని తరలించే భారీ వాహనాలను ప్రారంభించారు.



## ఆడుదాం ఆంధ్రాలో
# వందకోట్ల దుర్వినియోగం

- విచారణలో అన్ని విషయాలు బయటపెడతాం
- రెండేళ్లలో క్రీడల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాం
- గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడలకు ప్రోత్సాహం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

**అమరావతి,జూన్ 24 :** ఆడుదాం ఆంధ్రా' అక్రమాలపై విజిలెన్స్ నివేదిక త్వరలోనే బయటకు వస్తుందని క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. రూ.100 కోట్లకుపైగా ఇందులో అక్రమాలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయన్న ఆయన.. తప్పు చేసిన వారు తప్పించుకోలేరన్నారు. డీఎస్సీ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ అమల్లో సూక్ష్మ లోపాలు కూడా లేవని తేల్చి చెప్పారు. క్రీడల కోటాలో 3శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల .. గత రెండేళ్లలో 800 మందికి పైగా ఉద్యోగాలు సాధించారన్నారు. ఖేలో ఇండియా పథకం నిధులు రూ.75 కోట్లతో రాష్ట్రంలో మైదానాలను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. రెండేళ్లలో క్రీడలు, యువజన రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడలకు ప్రోత్సాహం అందించాం. సీఎం చంద్రబాబు సారథ్యంలో యువత, క్రీడాకారుల భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడిందని అన్నారు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గత రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో క్రీడాలు యువజన సేవల అభివృద్ధికి విశేష ప్రాధాన్యత నిస్తూ అనేక కీలక కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. అమరావతి సచివాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన క్రీడా వ్యవస్థను పునరుద్ధరించి, మౌలిక వసతుల కల్పన, క్రీడాకారుల ప్రోత్సాహం, యువత సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టిందన్నారు. విజయనగరం విజ్జీ స్టేడియం, తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాల యంలో మల్టీ పర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను పూర్తిచేసి ప్రారంభించామని తెలిపారు. ఖేలో ఇండియా పథకం కింద రూ.75 కోట్లతో విజయవాడ, కుప్పం, శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, గుంటూరులో ఆధునిక క్రీడా మౌలిక వసతుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ నేరాలు, మహిళల భద్రత వంటి అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా 593 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, 2,820 యువజన క్లబ్‌లను ఏర్పాటు చేసి యువతలో నాయకత్వ లక్షణాలు, స్వచ్ఛంద సేవా భావాన్ని పెంపొందించామని వివరించారు.

# సాయికృష్ణది కస్టోడియల్ డెత్

- డెడ్‌బాడీని మాయం చేసేశారు
- వారెంట్ ఉన్నా కోర్టులో హాజరు పర్చలేదు
- సస్పెండయిన సిఐ నాగరాజ్ కనుసన్నల్లోనే హత్య
- సాయికృష్ణ కేసులో కోర్టుకు సిట్ రిమాండ్ రిపోర్ట్



**విజయవాడ, జూన్ 24 :** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన గాదె సాయికృష్ణ మిస్సింగ్ కేసు మిస్టరీకి అధికారికంగా తెరపడింది. ఈ కేసులో అరెస్టయిన సీఐ నాగరాజును రిమాండ్ రిపోర్ట్‌తో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సాయికృష్ణది సాధారణ మిస్సింగ్ కేసు కాదని, అది కస్టడీయల్ డెత్ కేసుగా పేర్కొంటూ దర్యాప్తు బృందం కోర్టుకు నివేదిక సమర్పించింది. బుధవారం విజయవాడ 2వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఈ కేసు నిందితుడు సీఐ నాగరాజును హాజరుపరిచిన సిట్ అధికారులు.. దర్యాప్తులో వెలుగుచూసిన పలు కీలక అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సాయికృష్ణది కస్టోడియల్ డెత్ అని, అతడి డెడ్‌బాడీని మాయం చేశారని సిట్ తన రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొంది. రిమాండ్ రిపోర్టులో సిట్ కీలక విషయాలను వెల్లడించింది. నాన్ బెయిలబుల్ వారెంట్ ఉన్నా కోర్టులో హాజరుపర్చలేదని సిట్ వెల్లడించింది. గాదె సాయికృష్ణ మిస్సింగ్ కేసులో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. ప్రభుత్వాస్పత్రిలో సీఐ నాగరాజుకు వైద్య పరీక్షలు పూర్తికావడంతో 2వ ఏజేఎస్ కోర్టులో పోలీసులు హాజరుపర్చారు. ఈ సందర్భంగా కోర్టుకు సిట్.. రిమాండ్ రిపోర్టును సమర్పించింది. సాయికృష్ణను నాన్ బెయిలబుల్ వారెంట్‌లో తీసుకువచ్చి మాయం చేశారు. మే 5 నుంచి జూన్ 19 మధ్య కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ చేపట్టాం. 17 మంది సాక్షులను విచారణ చేశాం. ఫోరెన్సిక్ బృందం సాయంతో సీసీ కెమెరా ఫీడు స్వాధీనం చేసుకున్నాం. సాయికృష్ణ మిస్సింగ్ కేసులో హిమజ అనే స్టేషన్ సిబ్బందిని విచారించాం. కృష్ణలంక పోలీస్టేషన్‌లో సీసీఫుటేజీ డేటా సిస్టమ్‌లో లేదు. సాయికృష్ణ మృతదేహాన్ని పోలీస్ స్టేషన్‌లోనే చూసినట్లు ఎస్ఐ వాంగ్మూలం ఇచ్చారు. మే5 నుంచి మే8 మధ్య సాయికృష్ణని కృష్ణలంక పీఎస్‌లో చూసినట్టు ఎస్ఐ వాగ్మూలం ఇచ్చారు' అని రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ పేర్కొంది. సాక్షాలను నాశనం చేయడానికి , పోలీసు కస్టడీలో లేకుండా పోవడానికి సీఐ నాగరాజే కారణం. సీసీఫుటేజ్ డేటా 1-5-26 నుంచి 1-6-26 వరుకు డీవీఆర్‌లో లేకుండా చేశారు. ఫోరెన్సిక్ బృందానికి పరీక్ష కోసం డీవీఆర్‌లను పంపించాం. సాయికృష్ణ మరణించాడని తెలిసినా కూడా కృష్ణలంక పోలీస్ సిబ్బంది ఆ సమాచారం మెజిస్ట్రేట్‌కు చేరవేయలేదు. సాయికృష్ణ మరణించాడని అతని తల్లి స్టేషన్‌కు వెళితే సీఐ నాగరాజు దూషించాడు. హైకోర్టులో సాయికృష్ణ తల్లి హెబియస్ కార్పస్ వేసినా కోర్ట్ ముందు వాస్తవాలను వెల్లడించలేదు. హైకోర్ట్ ముందు నిజాలు దాచారు , కోర్ట్‌ను తప్పుదోవ పట్టించారు. ఈ పరిణామాలన్నీ గమనించాక సైంటిఫిక్ ఎవిడెన్స్ చెరిపివేయడం ద్వారా సాయికృష్ణను హత్య చేశాడని గుర్తించాం. సాయికృష్ణ మిస్సింగ్ కేసులో ఆధారాలు పూర్తిగా ధ్వంసం చేశారు. అన్ని అంశాలు తెలుసుకోవాలంటే నిందుతుడైన నాగరాజును విచారించాల్సి ఉంది. జూన్ 2 కంటే ముందే సాయికృష్ణ మరణించాడని మేము విశ్వస్తున్నాం. కస్టడీలో ఉండగా గాయాలపాలై మరణించాడని అన్ని ఆధారాలు స్పష్టంగా చెబుతున్నాయి' అంటూ రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ వెల్లడించింది. చివరకు సాయికృష్ణను కస్టోడియల్ డెత్ చేశారని సిట్ నిర్ధారించింది. సిట్ తరఫున వాదనలు వినిపించిన ప్రభుత్వ న్యాయవాది ప్రకారం.. గత నెల 8న మార్కాపురంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గాదె సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారు. అతడిపై నాన్-బెయిలబుల్ వారెంట్ ఉన్నప్పటికీ, చట్ట ప్రకారం కోర్టులో హాజరుపరచలేదని తెలిపారు. ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని పేర్కొన్నారు. దర్యాప్తులో సాయికృష్ణ పోలీసుల అదుపులో ఉండగానే మృతి చెందినట్లు ఆధారాలు లభించాయని సిట్ కోర్టుకు వెల్లడించినట్లు తెలుస్తోంది. అంతేకాక, మరణం అనంతరం అతడి మృతదేహాన్ని కూడా మాయం చేసినట్లు అనుమానాలు వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో కేసు తీవ్రత మరింత పెరిగింది. అయితే సాయికృష్ణ మృతదేహాన్ని మాయం చేశారన్న ఆరోపణలకు ఆధారాలేమిటని న్యాయమూర్తి ప్రశ్నించినట్లు సమాచారం. దీనికి స్పందించిన దర్యాప్తు వర్గాలు.. కేసుకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను ఉద్దేశపూర్వకంగా తొలగించినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, తన కుమారుడు కనిపించడం లేదంటూ సాయికృష్ణ తల్లి ఇప్పటికే హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ విచారణ, సిట్ దర్యాప్తు, తాజాగా కోర్టులో వెల్లడైన అంశాలు కేసును మరింత కీలక దశకు తీసుకెళ్లాయి. నాగరాజు రిమాండ్ రిపోర్టులో నమోదైన అంశాలు, సిట్ కోర్టుకు సమర్పించిన వివరాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

# చంద్రబాబు జేబు సంస్థగా పోలీస్ వ్యవస్థ

- సాయికృష్ణ కేసులో సాక్ష్యాలను మాయం చేశారు
- పోలీసుల తీరుకు నిరసనగా వచ్చే నెల 29న పాదయాత్ర
- మీడియా సమావేశంలో అంబటి రాంబాబు




**గుంటూరు, జూన్ 24 :** ఏపీలో పోలీసు వ్యవస్థ చంద్రబాబు జేబు సంస్థగా మారిందని మాజీ మంత్రి అంబటి రాంబాబు సంచలన ఆరోపణలు చేశారు. సాయికృష్ణ కేసులో సాక్ష్యాలను మాయం చేశారు. ఏ తప్పు చేయకపోయినా తనను అరెస్ట్ చేశారంటూ మండిపడ్డారు. 18 రోజుల పాటు రాజమండ్రి జైల్లో ఉంచారు. వచ్చే నెల 29న వినతి పాదయాత్ర చేస్తా అని అంబటి ప్రకటించారు. అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ..'కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఒత్తిడితో నే నాపై కేసులు నమోదు చేశారు. నా ఇంటిపై దాడి చేయడమే కాకుండా నాపై అక్రమంగా రెండు కేసులు పెట్టారు. నన్ను జైలులో ఉంచారు. రెండు కేసుల్లో ఏడేళ్ళ లోపు శిక్ష పడే సెక్షన్లే పెట్టారు. ఈ కేసులో ఇద్దరు సీఐలు, ఒక ఎస్ఐకి హైకోర్టు.. కోర్టు ధిక్కరణ కింద నోటీసులు ఇచ్చింది. వంశీధర్ అనే సీఐ, మధు అనే ఎస్ఐ ఇల్లీగల్‌గా నన్ను లోపలేశారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లుకి హైకోర్టు నోటీస్ ఇచ్చింది. ఈ ముగ్గురు పోలీసులను కేంద్ర మంత్రి పెమ్మసాని పురిగొల్పి నన్ను అరెస్ట్ చేయించారు. డీజీపీ, ఐజీ, ఎస్పీ, డిఎస్పీలకు చెబుతున్నాను. నా ఇంటిపై దాడి చేసిన వాళ్లపై ఎందుకు చర్యలు తీసుకోలేదు. అందుకే వచ్చే నెల 29వ తేదీన వినతి పాదయాత్ర చేస్తున్నాను. పోలీస్ వ్యవస్థ చంద్రబాబు జేబు సంస్థగా కొనసాగుతుంది. సాయికృష్ణ అంశంపై మేము పోరాడటానికి కారణం వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయనే. కృష్ణలంక పోలీస్ స్టేషన్లో ఏడాది సీసీటీవీ ఫుటేజ్ మాయం చేశారు. ఏడాది నుండి పీఎస్‌లో నేరాలు జరుగుతున్నాయి. ఐజీ రవి ప్రకాష్ ఆధ్వర్యంలోనే సాక్ష్యాధారాలు మాయం చేశారు. సీఐ నాగరాజుతో బేరసారలాడారు. ఏ పోలీస్ పేరు చెప్పవద్దని సీఐ నాగరాజును బతిమలాడారు. ఏ తప్పు చేయకపోయినా నన్ను అరెస్టు చేసి జైలులో వేశారు. కానీ, సీఐ నాగరాజును లాకప్‌లో ఎందుకు వేయలేదు?. పోలీసులు ప్రజలను కాపాడలేరు. సీఎం, హోంమంత్రి విఫలమయ్యారు. పవన్ కల్యాణ్.. నాగరాజును జిందాబాద్ అంటారేంటి ఆయనకు సిగ్గు అనిపించడం లేదా?. పవన్ కల్యాణ్ ఆత్మవిమర్శ చేసుకోవాలి. హోంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## సాయికృష్ణ అదృశ్యం కేసులో
# సిబిఐ విచారణ

- హైకోర్టులో పిల్ దాఖలు.. సిట్ దర్యాప్తుపై ప్రభుత్వ వివరణ
- విచారణ జూలై 6కు వాయిదా వేసిన కోర్టు

**అమరావతి, జూన్ 24 :** విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ కేసు ఆంధ్రప్రదేశ్ రాజకీయ, పోలీస్ వర్గాల్లో సంచలనంగా మారింది. అసలు సాయికృష్ణ ఏమయ్యాడనే దానికి సమాధానం దొరకడం లేదు. ఈ కేసు విచారణను కేంద్ర దర్యాప్తు సంస్థకి అప్పగించాలని కోరుతూ ఏపీ హైకోర్టులో దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసు విచారణ సందర్భంగా ఏపీ ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కోర్టుకు దర్యాప్తు పురోగతిని వివరించారు. ఈ కేసు సమగ్ర దర్యాప్తు కోసం ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఏజీ ధర్మాసనానికి తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు పారదర్శకంగా, సక్రమంగా సాగేందుకు ప్రభుత్వం అన్నిరకాల కఠిన చర్యలు తీసుకుందని ఏజీ వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కృష్ణలంక సీఐ నాగరాజును ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారని, బుధవారం ఆయనను కోర్టు ముందు హాజరుపరుస్తామని ఏజీ హైకోర్టుకు స్పష్టం చేశారు. అడ్వొకేట్ జనరల్ వాదనలు విన్న న్యాయస్థానం.. సిట్ దర్యాప్తు ఎలా సాగుతుందో, నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో, ఏం చేస్తారో వేచి చూద్దామని వ్యాఖ్యానించింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను జులై 6వ తేదీకి వాయిదా వేసింది. సిట్ విచారణలో సీఐ నాగరాజు నోరు విప్పని నేపథ్యంలో, ఆయన అరెస్ట్ కావడం, కోర్టు ముందు హాజరు పరుస్తుండటంతో ఈ కేసులో మరిన్ని సంచలన నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.



# గట్టు లక్ష్మీనరసింహస్వామి సేవలో జగన్

### ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ సిఎం

**పులివెందుల, జూన్ 24 :** వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పులివెందుల పర్యటనలో ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా వైఎస్ జగన్.. వేముల మండలంలోని భూమయ్యగారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గట్టు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. జగన్.. గట్టు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకోగానే అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం, ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి.. కలశ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను, నిర్వాహకులను అభినందించనున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఓబుళరెడ్డి శ్రీరామిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు.

## సాయిబాబా భక్తుల
# మనోభావాలను గౌరవిస్తాం

### దుష్ప్రచారాన్ని నమ్మవద్దు : రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి




**అమరావతి,జూన్ 24 :** సాయిబాబా ఆలయాల విషయంలో తాను చేసిన వ్యాఖ్యలను కొంతమంది వక్రీకరించి, సాయిబాబా భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేయడం బాధాకరం. నా వ్యాఖ్యల ఉద్దేశాన్ని పూర్తిగా పక్కనబెట్టి కొన్ని మీడియా సంస్థలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నేను ఖండిస్తున్నాను. ముందుగా ఒక విషయం చాలా స్పష్టంగా చెబుతున్నాను. నేను వ్యక్తిగతంగా సాయిబాబా భక్తుడిని. ప్రతిరోజూ ఉదయం నా పూజా మందిరంలో వివిధ దేవతామూర్తులతో పాటు గురుపీఠంపై కొలువై ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించిన తర్వాతే నా దినచర్యను ప్రారంభిస్తాను. సాయిబాబా పట్ల నాకు అత్యంత గౌరవం, భక్తి ఉన్నాయి. నా వ్యాఖ్యల వల్ల ఏ ఒక్క భక్తుని మనోభావాలు దెబ్బతిని ఉంటే, వారిని హృదయపూర్వకంగా మన్నించమని కోరుతున్నాను అన్నారు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. రాష్ట్ర ప్రభుత్వం గానీ, దేవాదాయ శాఖ గానీ, తిరుమల తిరుపతి దేవస్థానాలు గానీ ఎవరిపైనా వివక్ష చూపడం లేదు. అలాగే ఎవరైనా ఆరాధించే మహనీయులను కించపరచే ఉద్దేశం కూడా తమకు లేదని అన్నారు. సాయిబాబా పట్ల కోట్లాది మంది భక్తులకు అపారమైన విశ్వాసం ఉంది. ఆ విశ్వాసాన్ని మేము పూర్తిగా గౌరవిస్తాము. సాయిబాబా ఆలయాల్లో పూజలు హిందూ సంప్రదాయాలకు అనుగుణంగా జరుగుతున్నాయన్న విషయం కూడా అందరికీ తెలిసిందే. అయితే టీటీడీ ఆధ్వర్యంలో చేపడుతున్న 5వేల భజన మందిరాలు నిర్మాణ కార్యక్రమానికి ఒక నిర్దిష్ట లక్ష్యం ఉంది. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ, ప్రచారం, గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ హిందూ దేవాలయాల నిర్మాణమే ఆ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి నిధుల విడుదల టీటీడీ రూపొందించిన మార్గదర్శకాలు, శ్రీవాణి ట్రస్టు నిబంధనలు, పరిపాలనా విధానాల ప్రకారమే జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇది ఎవరి విశ్వాసాన్ని తక్కువ చేసి చూడడం కాదని, నిధుల కేటాయింపు అనేది పూర్తిగా ట్రస్టు లక్ష్యాలు, నిబంధనలు, పరిపాలనా మార్గదర్శకాల ఆధారంగా జరుగుతున్న ప్రక్రియ మాత్రమే అని స్పష్టం చేసారు. సాయిబాబా ఆలయాలకు ఈ పథకం కింద నిధులు ఇవ్వకపోవడం అంటే సాయిబాబా స్వామివారిని లేదా ఆయన భక్తులను అవమానించడం కాదని స్పష్టం చేసారు. మన సమాజంలో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, పరమశివుడు, అమ్మవారు, అయ్యప్ప స్వామి, ఆంజనేయస్వామి, సాయిబాబా వంటి అనేక ఆరాధనా రూపాల పట్ల ప్రజలకు అపారమైన విశ్వాసం ఉంది. ప్రభుత్వం ఏ విశ్వాసాన్నీ కించపరచదు. ప్రతి భక్తుని మనోభావాలను గౌరవించడం మా ప్రభుత్వ విధానం. కాబట్టి ఈ అంశాన్ని అనవసర వివాదంగా మార్చడం సరికాదని అన్నారు. ఇది భక్తి, విశ్వాసాలకు సంబంధించిన అంశం కాదు. ట్రస్టుల లక్ష్యాలు, వాటి నిబంధనలు, పరిపాలనా విధానాలకు సంబంధించిన అంశం మాత్రమే. సనాతన ధర్మ పరిరక్షణతో పాటు ప్రతి భక్తుని విశ్వాసాన్ని గౌరవించడం కూటమి ప్రభుత్వం, దేవాదాయ శాఖ యొక్క స్పష్టమైన విధానం. సాయిబాబా భక్తుల విశ్వాసాన్ని గౌరవిస్తాం. అదే సమయంలో సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ట్రస్టుల లక్ష్యాలను కూడా గౌరవిస్తాం. వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ఎవరూ నమ్మవద్దని మంత్రి కోరారు.

## వైకాపా హయాంలోనే
# పోలవరం కట్టల మట్టి లూటీ

### విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఆరోపణలు

**విజయవాడ, జూన్ 24 :** వైకాపా హయాంలోనే పోలవరం కట్టల మట్టి లూటీ జరిగిందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఆరోపించారు. అప్పటి అక్రమాలకు సంబంధించిన ఫొటోలను చూపిస్తూ.. కట్టు కథనాలతో సాక్షిపత్రిక అడ్డంగా దొరికిపోయిందని విమర్శించారు. పోలవరం కుడికాలువ కింద 2కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టిని దోచేశారని, దీనిపై 2022లోనే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కేసు కూడా నమోదైందని అన్నారు. కానీ, ఇప్పుడేదో జరిగిపోయిందని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఫేక్ నాయకులు, ఫేక్ పార్టీ చేసే ఫేక్ ప్రచారంతో అడ్డంగా దొరికిపోయారన్నారు. ఇప్పటికైనా ప్రజలకు వాస్తవాలను చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం కుడి కాలువ కింద 2 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి దోచేశారనటానికి తన దగ్గర ఆధారాలు ఉన్నాయన్న కేశినేని చిన్ని.. దమ్ముంటే సీబీఐ, ఈడీ విచారణకు వైకాపా నేతలు సిద్ధపడాలని సవాల్ చేశారు.

# స్వల్పంగా దిగిన బంగారం ధరలు

**హైదరాబాద్, జూన్ 24 :** బంగారం కొనాలనుకునే వారికి శుభవార్త. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం, వెండి ధరలు మెల్లగా దిగి వస్తున్నాయి. అమెరికా డాలర్ బలపడడం, అక్కడి బాండ్ రాబడులు పెరగడం వంటి కారణాలతో పసిడికి డిమాండ్ తగ్గుతోంది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,44,330గా ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ. 1,32,300గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదలను నమోదు చేశాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ. 2,40,000గా ఉంది.








## సెన్సెక్స్ 791 పాయింట్లు పైకి

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, వడ్డీ రేట్ల పెంపు ఇప్పట్లో ఉండకపోవచ్చన్న ఆర్‌బీఐ గవర్నర్ సంకేతాలు సూచీలకు కలిసొచ్చాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు మరింత పతనం కావడం, విదేశీ మదుపర్లు కొనుగోళ్ల వైపు ఉండడమూ పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. ముఖ్యంగా ఐటీ, బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. దీంతో సెన్సెక్స్ ఓ దశలో 900 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ మళ్లీ 24 వేల మార్కు దాటింది. మదుపర్ల సంపద దాదాపు రూ. 2 లక్షల కోట్ల మేర పెరిగింది.

సెన్సెక్స్ ఉదయం 76,229.76 పాయింట్ల (క్రితం ముగింపు 76,200.68) వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లో కొనసాగిన సూచీ.. ఇంట్రాడేలో 77,190.37 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికు 790.54 పాయింట్ల లాభంతో 76,991.22 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 197.55 పాయింట్ల లాభంతో 24,021.65 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.65గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో, ట్రెంట్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎన్టీపీసీ, టాటా స్టీల్, మారుతీ సుజుకీ, బీఈఎల్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 75 డాలర్లకు చేరగా.. ఔన్సు బంగారం ధర 4,060 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

### కారణాలు ఇవే..

- వడ్డీ రేట్ల పెంపు ఆందోళనలకు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా చెక్ పెట్టారు. ప్రస్తుత దశలో వడ్డీ రేట్ల పెంపు గురించి మాట్లాడడం తొందరపాటే అవుతుందని పేర్కొన్నారు. ఓ ఆంగ్ల టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. చమురు ధరల ప్రభావం, ద్రవ్యోల్బణాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. వడ్డీ రేట్ల సవరణ ఉంటే ముందుగానే మార్కెట్‌ను అందుకు సిద్ధం చేస్తామని తెలిపారు.
- నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో దక్షిణ కొరియాకు చెందిన కోస్పి సూచీ 10 శాతం పతనం కావడం, ఇతర ప్రపంచ మార్కెట్‌లు కూడా అమ్మకాల ఒత్తిడి కారణంగా మన మార్కెట్‌లు నష్టాలు చవిచూశాయి. నేటి ట్రేడింగ్ సెషన్‌లో కోస్పి సూచీ తిరిగి పుంజుకోవడం, ఇతర మార్కెట్లూ రాణించడంతో మన మార్కెట్‌పై ఆ ప్రభావం పడింది.
- భారత్, అమెరికాల మధ్య చరిత్రాత్మక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకుందనే వార్తలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేశాయి. దీనికితోడు ముడిచమురు ధరలు నాలుగు నెలల కనిష్ఠానికి చేరాయి. చమురు దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే మన దేశానికి ఊరట కల్పించే అంశం కావడంతో సూచీలు పరుగులు పెట్టాయి.
- గత కొన్ని రోజులుగా అమ్మకాల వైపు ఉంటున్న విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు వరుసగా మూడో సెషన్‌లోనూ కొనుగోళ్లు జరపడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. దీనికితోడు టెక్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి ఐటీ, బ్యాంకింగ్ షేర్లు సూచీలకు అండగా నిలిచాయి.



## హర్షిత్ సెంచరీ..

### వరంగల్ వారియర్స్ ఘన విజయం

**హైదరాబాద్:** టీజీ20 లీగ్‌లో అన్విత ఖమ్మం ఏసెస్‌తో జరిగిన మ్యాచ్‌లో వరంగల్ వారియర్స్ ఘన విజయం సాధించింది. 203 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన వరంగల్.. 18.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి టార్గెట్‌ను ఛేదించింది. హర్షిత్ చౌదరి 121లి పరుగులతో (62 బంతుల్లో) అదరగొట్టాడు. ఆర్ సిసోదియా 27 రన్స్ చేశాడు. మిగతా బ్యాటర్లెవరూ అంతగా రాణించలేదు. ఖమ్మం బౌలర్లలో వెంకట్ 2 వికెట్లు.. ఎం విప్పర్ల, వి రెడ్డి, సి మిలింద్ చెరో వికెట్ తీశారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఖమ్మం 19.2 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌటైంది. మయాంక్ గుప్తా (54), మిక్కిల్ జైస్వాల్ (54) హాఫ్ సెంచరీలతో రాణించారు. కచ్చి (17), హిమతేజ (23), పి రెడ్డి (20), మిలింద్ (11), విద్యానంద రెడ్డి (6) పరుగులు చేశారు. వరంగల్ వారియర్స్ బౌలర్లలో అబ్దుల్ మాలిక్ 3, అభిషేక్ 3, పల్లెపాటి 2, హుస్సేన్ ఒక వికెట్ తీశారు.



## ఇంగ్లాండ్ టూర్..

### భారత డ్రెస్సింగ్ రూమ్‌లోకి వైభవ్‌కు నో ఎంట్రీ..!

కేవలం 15ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ మ్యాచ్ ఆడేందుకు ఎంపికైన వైభవ్ సూర్యవంశీకి ఇంగ్లాండ్‌లో స్వల్ప అవరోధం కలగనుంది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు వైభవ్‌తోపాటు అతడి తల్లిదండ్రులు వెళ్లేందుకు బీసీసీఐ అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ఇంగ్లాండ్‌లో మాత్రం వైభవ్ సూర్యవంశీకి భారత డ్రెస్సింగ్ రూమ్‌లో ఉండే అవకాశం లేకుండా పోతుందని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. దానికి కారణం అక్కడి నిబంధనలేనని తెలుస్తోంది. జులై 1 నుంచి ఇంగ్లాండ్‌లో టీమ్‌ఇండియా పర్యటించనుంది. ఐసీసీ, ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు నిబంధనల ప్రకారం 16 ఏళ్లలోపు ఆటగాళ్లకు ప్రత్యేక గదులు కేటాయిస్తారు. అయితే, ఈ విషయంపై బీసీసీఐ అధికారులు ఇంగ్లాండ్ బోర్డు ప్రతినిధులతో చర్చించే అవకాశం ఉంది. "ఇది ఐసీసీ ఈవెంట్. వారి అధికార పరిధి ఉన్నందున భద్రతా విధానాలు అమల్లో ఉంటాయి. 16 ఏళ్లలోపు ప్లేయర్లు పెద్దల ఛేంజింగ్ రూమ్స్‌ను వాడేందుకు అనుమతి లేదు. కాబట్టి, సూర్యవంశీకి ప్రత్యేకంగా గదిని కేటాయించే అవకాశం ఉంది. అతడితోపాటు తల్లిదండ్రులు కూడా వస్తారు. వారికి కూడా ప్రతి వేదిక వద్ద వసతి సదుపాయం కల్పిస్తాం. మ్యాచ్ సమయంలోనే వైభవ్‌కు డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లేందుకు అనుమతి ఉంది. మ్యాచ్‌కు ముందు.. తర్వాత ఛేంజింగ్ కోసం వెళ్లడానికి అనుమతి ఉండదు" అని ఈసీబీ క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.

### కామెంట్లకు ఫుల్‌స్టాప్ పడేలా..

## రో-కోపై నిర్ణయం తీసుకోండి

### మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్



వన్డే ప్రపంచ కప్ లక్ష్యంగానే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ సన్నద్ధమవుతున్నారు. కేవలం 50 ఓవర్ల ఫార్మాట్‌లోనే కొనసాగుతోంది కూడా అందుకోసమే. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌కూ ఇద్దరు ఎంపికైన సంగతి తెలిసిందే. మరోవైపు వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్‌లో వీరిద్దరికి చోటు దక్కడం కష్టమేనన్న వాదనా ఉంది. ఈ విషయంలో మేనేజ్‌మెంట్ కూడా స్పష్టత ఇవ్వడం లేదు. ఈ క్రమంలో మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ కాస్త ఘాటు వ్యాఖ్యలు చేశాడు. రో-కోపై కొందరు ఎక్కువగా నెగెటివ్ ప్రచారం చేస్తున్నారని.. సెలక్టర్లు త్వరగా నిర్ణయం తీసుకోవాలన్నాడు. "రోహిత్, విరాట్ గురించి వస్తోన్న వార్తలు బాగోలేవు. అసలు ఎక్కడ నుంచి ఇలాంటి నెగెటివ్ ప్రచారం వస్తోందో తెలియడం లేదు. కొందరు మాత్రం ఈ ఇద్దరు ప్రపంచ కప్‌లో ఆడకూడదని బలంగా కోరుకుంటున్నారు. ఎందుకు ఇలాంటి ఆలోచన చేస్తున్నారో తెలియదు. కొందరేమో వారు ఆడకపోవచ్చని అనుమానాలు వచ్చేలా మాట్లాడతారు. మరికొందరు మాత్రం విరాట్, రోహిత్ ఉంటేనే బాగుంటుందంటారు. నా వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచ కప్‌లో అనుభవం ఉన్న ఆటగాళ్లు ఉండటం ముఖ్యం" అని అశ్విన్ తెలిపాడు. "వన్డే ప్రపంచ కప్‌లో విరాట్, రోహిత్ ఉండాలని మీరు కోరుకుంటే.. ఇప్పుడే నిర్ణయం తీసుకోండి. అలా చేయడం వల్ల టోర్నీ నాటికి వారు కాన్ఫిడెంట్‌గా ఉంటారు. ఒకవేళ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే.. మున్ముందు ఈ అంశం సంక్లిష్టంగా మారే అవకాశం ఉంది" అని అశ్విన్ వ్యాఖ్యానించాడు.

## ఇన్‌స్టాలో పంత్ ఆసక్తికర పోస్ట్..!



ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి అధికారికంగా స్వాప్ అయిన తర్వాత రిషభ్ పంత్ సోషల్ మీడియాలో ఆసక్తికర పోస్ట్ పెట్టాడు. లక్నో సూపర్ జెయింట్స్ తనకు వీడ్కోలు పలుకుతూ పెట్టిన పోస్ట్‌ను షేర్ చేస్తూ.. 'థాంక్యూ టీమ్' అని రాసుకొచ్చాడు. రూ. 27 కోట్ల రికార్డు ధరతో లక్నోలో చేరిన పంత్.. కెప్టెన్‌గా, ఆటగాడిగా విఫలం కావడంతో జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగుకు పడిపోయింది. ఈ క్రమంలోనే కుల్‌దీప్ యాదవ్‌తో ట్రేడ్ ద్వారా పంత్ రూ. 12 కోట్ల జీతాన్ని తగ్గించుకుని మళ్లీ ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి రీఎంట్రీ ఇచ్చాడు. ఐపీఎల్‌లో అత్యధిక ధర పలికిన ఆటగాడిగా రికార్డు క్రియేట్ చేసిన రిషభ్ పంత్.. రెండేళ్ల తర్వాత లక్నో సూపర్ జెయింట్స్‌ను వీడాడు. ఐపీఎల్ 2025 వేలంలో లక్నో.. రిషభ్ పంత్‌ను రూ. 27 కోట్లకు దక్కించుకుంది. కెప్టెన్‌ను చేసింది. అయితే ఆటగాడిగా, కెప్టెన్‌గా దారుణంగా విఫలమయ్యాడు. దీంతో లక్నో సూపర్ జెయింట్స్.. పంత్‌ను వదిలేసింది. స్వాప్ డీల్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి కుల్‌దీప్ యాదవ్‌ను తెచ్చుకుని.. రిషభ్‌ను ఇచ్చేసింది. అయితే ఇది జరిగిన తర్వాత ఈ వికెట్ కీపర్ ఆసక్తికర పోస్టు పెట్టాడు. స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌తో ట్రేడ్ తర్వాత.. అతడు సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టాడు. లక్నో సూపర్ జెయింట్స్ వీడ్కోలు పోస్ట్‌ను షేర్ చేస్తూ.. 'థాంక్యూ టీమ్' అని రాసుకొచ్చాడు. దీంతో పంత్‌కు, లక్నో సూపర్ జెయింట్స్‌కు మధ్య బంధం తెరపడినట్లయింది. ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు లక్నోలో చేరిన అతడు.. ఐపీఎల్ 2026 పూర్తయిన కొన్ని రోజులకే ఆ ఫ్రాంఛైజీని వీడాడు. ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తరఫున పంత్.. ఆశించిన మేర రాణించలేకపోయాడు. ఎన్నో అంచనాలతో కొత్త ఫ్రాంఛైజీలో చేరిన అతడు.. అంచనాలను అందుకోలేదు. ఐపీఎల్ 2025లో లక్నో.. ఆరు విజయాలు, ఎనిమిది ఓటములతో పాయింట్ల పట్టికలో ఏడో స్థానంలో నిలిచింది. తర్వాతి సీజన్ మరింత కష్టంగా మారింది. పంత్ నాయకత్వంలోని జట్టు 14 మ్యాచ్‌లలో కేవలం నాలుగు విజయాలతో పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానానికి పరిమితమైంది. ఐపీఎల్ 2025లో పంత్ 14 మ్యాచ్‌లలో 269 పరుగులు చేశాడు. ఐపీఎల్ 2026లో 312 పరుగులు చేశాడు. ఇందులో ఒకే అర్ధశతకం ఉంది. ఇక తాజా ట్రేడ్ ద్వారా పంత్ జీతంలో భారీ కోత పడింది. అతడు తన ఐపీఎల్ జీతంలో ఏకంగా రూ. 12 కోట్లు తగ్గించుకున్నాడు. రూ. 15 కోట్లకు ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరిపోయాడు. 2016 నుంచి 2024 మధ్య ఎనిమిది సీజన్ల పాటు తాను ఆడిన ఫ్రాంచైజీతో అతడు మళ్లీ జతకట్టాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలోకి వెళ్లే ముందు పంత్ ఢిల్లీ తరఫున 111 మ్యాచ్‌లు ఆడాడు. అలాగే 2021 నుంచి 2024 వరకు జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి, 43 మ్యాచ్‌లలో జట్టును నడిపించాడు.

## హార్దిక్ పాండ్యాపై కన్నేసిన ఫ్రాంచైజీలు!



ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఆ జట్టును వీడటం దాదాపు ఖాయమైంది. హార్దిక్‌ను వదులుకునేందుకు ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ కూడా సిద్ధంగా ఉంది. ఐపీఎల్ 2026 సీజన్ మధ్యలోనే హార్దిక్ పాండ్యా తన నిర్ణయాన్ని ఫ్రాంచైజీకి తెలియజేసినట్లు వార్తలు వచ్చాయి. సీనియర్ ఆటగాళ్ల నుంచి సహకారం లేకపోవడం, వరుస పరాజయాలతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన హార్దిక్ పాండ్యా.. జట్టులో కొనసాగడం తన వల్ల కాదని చెప్పాడని పీటీఐ పేర్కొంది. అయితే ట్రేడింగ్ విండో ద్వారా హార్దిక్ పాండ్యాను తీసుకునేందుకు కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్)తో పాటు రాజస్థాన్ రాయల్స్(ఆర్ఆర్) ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాజస్థాన్ రాయల్స్.. ముంబై ఇండియన్స్‌తో సంప్రదింపులు ప్రారంభించినట్లు వార్తలు కూడా వచ్చాయి. వీలైతే క్యాష్ డీల్ లేదా స్వాప్ డీల్ ద్వారా హార్దిక్ పాండ్యాను తీసుకునేందుకు రాజస్థాన్ రాయల్స్ సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. హార్దిక్ పాండ్యా కోసం యశస్వి జైస్వాల్‌ను ఇచ్చేందుకు కూడా రాజస్థాన్ రాయల్స్ రెడీ అయినట్లు సమాచారం. ముంబై ఇండియన్స్ కూడా యశస్వి జైస్వాల్‌ను తీసుకునేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. హార్దిక్ పాండ్యా జట్టులోకి వస్తే రాజస్థాన్ రాయల్స్ అతనికి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించనుంది. కోల్‌కతా నైట్‌రైడర్స్ కూడా హార్దిక్ పాండ్యా కోసం పోటీపడుతున్నట్లు తెలుస్తోంది. క్యాష్ డీల్‌తో పాటు ప్లేయర్ స్వాప్ డీల్‌కు కూడా ఓకే చెప్పినట్లు సమాచారం. ఇప్పటికే ముంబై ఇండియన్స్‌తో కేకేఆర్ సంప్రదింపులు ప్రారంభించినట్లు వార్తలు వస్తున్నాయి. అజింక్యా రహానేతో పాటు రింకూ సింగ్‌ను వదులుకునేందుకు కూడా కోల్‌కతా నైట్‌రైడర్స్ సిద్ధమైనట్లు పీటీఐ పేర్కొంది. కోల్‌కతా జట్టులోకి వెళ్లినా హార్దిక్ పాండ్యా కెప్టెన్సీ దక్కనుంది. ఒకవేళ మినీ వేలంలోకి వచ్చిన హార్దిక్ పాండ్యా భారీ ధర పలికే ఛాన్స్ ఉంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో హార్దిక్ పాండ్యా సారథ్యంలోనే ముంబై ఇండియన్స్ దారుణంగా విఫలమైంది. 14 మ్యాచ్‌ల్లో నాలుగు మాత్రమే గెలిచి పాయింట్స్ టేబుల్‌లో 9వ స్థానంలో నిలిచింది. గతంలో గుజరాత్ టైటాన్స్ నుంచి హార్దిక్ పాండ్యాను ముంబై ఇండియన్స్ క్యాష్ డీల్ ద్వారా కొనుగోలు చేసింది. కానీ అతని సారథ్యంలో ముంబై ఘోర పరాజయాలను చవిచూసింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో ప్లే ఆఫ్స్ చేరినా.. ఐపీఎల్ 2024, 2026 సీజన్‌లో దారుణంగా విఫలమైంది.




## క్విక్‌కామర్స్‌లో మరింత పోటీ..

### 300 నగరాలకు అమెజాన్ నౌ

క్విక్ కామర్స్ విభాగంలో పోటీ మరింత తీవ్రం కానుంది. ప్రస్తుతం ఈ విభాగంలో బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో పోటీ పడుతుండగా.. ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ కూడా ఈ మధ్యే రేసులోకి దిగింది. ప్రస్తుతం ప్రధాన నగరాలకే పరిమితమైన తన 'అమెజాన్ నౌ' క్విక్ కామర్స్ సేవలను మరింత విస్తరించనుంది. దేశంలోనే అతిపెద్ద క్విక్ కామర్స్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసే లక్ష్యంతో 300 నగరాలకు అమెజాన్ నౌ సేవలను విస్తరించనున్నట్లు కంపెనీ సీఈఓ ఆండీ జెస్సీ ప్రకటించారు. భారత్ పర్యటనకు వచ్చిన ఆయన.. బుధవారం అమెజాన్ మైక్రో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విస్తరణ ప్రణాళికను ప్రకటించారు. ప్రస్తుతం అమెజాన్ నౌ సేవలు హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ- ఎన్‌సీఆర్, ముంబయి, పుణె వంటి 15కు పైగా నగరాల్లో అందుబాటులో ఉన్నాయి. దీనిని మరింత వేగంగా విస్తరించడానికి మైక్రో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను అమెజాన్ భారీగా పెంచనుంది. 300 నగరాలకు ఈ సేవలను చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. అమెజాన్ నౌ సేవలు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ప్రతి త్రైమాసికంలో ఆర్డర్లు రెట్టింపు అవుతున్నాయని అమెజాన్ ఇండియా అధిపతి సమీర్ కుమార్ తెలిపారు. అమెజాన్ ఇండియా చరిత్రలోనే ఇది అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బిజినెస్ యూనిట్‌గా నిలిచిందన్నారు.

## జీతాలు ఇవ్వట్లేదు

### సింగపూర్ సంస్థలపై భారత కార్మికుల ఆరోపణలు

తమకు జీతాలు ఇవ్వట్లేదని భారత్, బంగ్లాదేశ్‌కు చెందిన 400 మంది వలస కార్మికులు సింగ్‌పూర్ సంస్థలపై ఆరోపణలు చేశారు. దీంతో ఆ దేశంలోని మానవవనరుల శాఖ దర్యాప్తు ప్రారంభించింది. కేపీఏ ఇంజినీరింగ్, ఎస్‌కే ఇండస్ట్రీస్‌లో పనిచేస్తున్న 100 మంది కార్మికులు తొలుత ఫిర్యాదు చేయడంతో ఈ విచారణ మొదలైంది. తర్వాత నుంచి బాధితుల సంఖ్య పెరుగుతూ వచ్చిందని, వారు వసతి ఏర్పాట్లపైనా ఫిర్యాదు చేశారని స్థానిక మీడియా వెల్లడించింది. దాంతో రెండు సంస్థల కార్యకలాపాలపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. బిజినెస్ రికార్డులను బట్టి.. ఈ రెండు సంస్థలు విదేశీ వ్యక్తుల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ఈ రెండు కంపెనీలకు ఒకే వ్యక్తి డైరెక్టర్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయనకు ఎయిర్ కండీషనింగ్, ప్లంబింగ్, బిల్డింగ్ సర్వీసెస్ వంటి రంగాలకు చెందిన ఇతర సంస్థలతో సంబంధాలు ఉన్నాయి. ఆయన గత ఏడాది ఒకేరోజు మూడు వేర్వేరు కంపెనీలను రిజిస్టర్ చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. జీతం రాకపోవడంతో ఈ కార్మికులకు ఆహారం కూడా అందడం లేదని, దాంతో తాము కనీస సదుపాయాలు కల్పిస్తున్నామని మైగ్రెంట్ వర్కర్స్ సెంటర్ వెల్లడించింది. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.




# 'గాసిప్' సినిమా చూడాల్సిందే

మనం సరదాగా మాట్లాడే మాటలు ఇతరుల జీవితాల్ని ఎలా ప్రభావితం చేస్తాయో తెలియాలంటే మా 'గాసిప్' సినిమా చూడాల్సిందే' అంటున్నారు దర్శకుడు వైభవ్ కౌండిన్య. ఆయన తెరకెక్కించిన ఈ చిత్రంలో రాశీ సింగ్ ప్రధాన పాత్ర పోషించగా.. యతి రేమెళ్ల నిర్మించారు. రవివర్మ, మహేశ్ యడ్లపల్లి, పృథ్వీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 26న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే దర్శకుడు సాయికిరణ్ అడివి ఇటీవల హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వైభవ్ కౌండిన్య మాట్లాడుతూ.. 'మాటకు చాలా శక్తి ఉంది. ఒక మాట మనిషిని నిలబెట్టగలదు. అదే మాట అతడిని కూల్చగలదు. అందుకే ఇతరుల గురించి మాట్లాడేటప్పుడు బాధ్యత ఉండాలని సందేశాన్నిచ్చే చిత్రమిది. నా జీవితంలో.. నా మిత్రుల జీవితాల్లో జరిగిన కొన్ని నిజ సంఘటనలు దీంట్లో ఉన్నాయి. ఇదొక మంచి భావోద్వేగభరిత ప్రయాణం. కచ్చితంగా అందర్నీ ఆలోచింపజేస్తుంది' అన్నారు.

# చరణ్‌పై మోడీ ప్రశంసలతో పులకించా

## ఎక్స్ వేదికగా చిరంజీవి ఆనందోత్సాహం




మెగాస్టార్ చిరంజీవి తన కుమారుడు రామ్ చరణ్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ఇటీవల 'పెద్ది' సినిమాతో సూపర్ హిట్‌ను అందుకుని టాప్ ట్రెండింగ్‌లో ఉన్న రామ్ చరణ్ రిపబ్లిక్ టీవీ నిర్వహించిన ఒక ప్రతిష్టాత్మక కార్యక్రమంలో గెస్ట్‌గా పాల్గొన్నారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ రామ్ చరణ్‌ను న్యూ ఏజ్ మెగాస్టార్ అని సంబోధించారు. దీనిపై చిరంజీవి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ సుమతీ శతక పద్యంతో తన పోస్ట్‌ను ప్రారంభించారు. 'పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడే పుట్టదు, జనులా పుత్రుని గనుగొని పొగడగా, పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ'. అని రాస్తూ కొడుకు పుట్టగానే తండ్రికి నిజమైన సంతోషం కలగదని, సమాజంలో ఆ కొడుకు గొప్పతనాన్ని చూసి జనాలు మెచ్చుకున్నప్పుడే ఆ తండ్రికి నిజమైన ఆనందం కలుగుతుందని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న కార్యక్రమంలో రామ్ చరణ్‌ను న్యూ ఏజ్ మెగాస్టార్ అని సంబోధించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని చిరంజీవి తెలిపారు. ఇలాంటి ప్రతిష్టాత్మక వేదికలపై చరణ్‌కు లభిస్తున్న గుర్తింపు, గౌరవం చూస్తుంటే ఒక తండ్రిగా గర్వంగా ఉందన్నారు. తన కృషి, అంకితభావం, నటనతో ప్రేక్షకుల అభిమానాన్ని మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా విశేషమైన గుర్తింపును కూడా సంపాదించుకోవడం నిజంగా సంతోషకరమని పేర్కొన్నారు. ఇంకా మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని చిరంజీవి ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ వైరల్‌గా మారింది.

# రంగస్థలం తరువాత అంతటి సినిమా పెద్ది

**ఎంతో కష్టపడితే తప్ప ఇంతగా ప్రేక్షకులు ఆదరించరు**

**చరణ్ నటనను చూసి పుత్రోత్సాహం ఆస్వాదిస్తున్నా**

**దర్శకుడు బుచ్చిబాబును అభినందించిన చిరు**




నటుడిగా ఎంతో పరిపక్వత, పరిపూర్ణతని ప్రదర్శిస్తున్న రామ్‌చరణ్‌ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. తండ్రిగా గర్వపడుతున్నానని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. ఆయన ముఖ్య అతిథిగా మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో 'పెద్ది' విజయోత్సవం జరిగింది. రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. జాన్వీ కపూర్ కథానాయిక. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించారు. వెంకట సతీశ్ కిలారు నిర్మాత. ఈ వేడుకలో చిత్రబృందం, పంపిణీదారులు, ప్రదర్శనకారులకి జ్ఞాపికలు ప్రదానం చేశారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ 'పెద్ది తరహా సినిమాలు రావాలి, పరిశ్రమ సుభిక్షంగా ఉండాలి. పెద్ది చూస్తూ భావోద్వేగానికి గురయ్యాను. అలాంటి అనుభూతినిచ్చే సినిమాలు అరుదుగా వస్తుంటాయి. ఆ కథా ప్రపంచంలో లీనమై ఉద్వేగానికి గురయ్యాను. పాత్రలతోపాటు బాధని అనుభవించా. ఇంత శక్తిమంతమైన, భావోద్వేగమైన కథ, పాత్రలకు చరణ్ న్యాయం చేస్తారని నమ్మిన దర్శకుడు బుచ్చిబాబుకు కృతజ్ఞతలు. సుకుమార్ తీసిన 'రంగస్థలం' చూసి రామ్‌చరణ్ ఎంత బాగా చేశాడో అన్నారు. అలాంటి రంగస్థలం రావాలంటే ఎన్నేళ్లు పడుతుందో అనుకున్నాం. పెద్దిలాంటి సినిమా ఇంత తొందరగా వస్తుందని ఊహించలేదు. ఆ విషయంలో చరణ్ చాలా అదృష్టవంతుడు. తను ప్రేక్షకుల్ని అంతగా కట్టిపడేయడానికి కారణం పాత్రని కఠోరంగా నమ్మడమే ప్రతి ఒక్కరికీ ఓ ధ్యేయం ఉండాలి. ఆ లక్ష్యంవైపు వెళ్లేందుకు శారీరకంగా శ్రమించాలి. ఎలా కష్టపడాలో ఈ సినిమాతో రామ్‌చరణ్ నిరూపించాడు. అత్యున్నతమైన నటన అని ప్రేక్షకులు మెచ్చుకున్నారంటే దాన్ని మించిన పురస్కారం మరొకటి ఉండదన్నారు. ఇప్పుడు చిరంజీవికాదు... చరణ్‌జీవి. ప్రధానితో కలిసి ఈమధ్యే పాల్గొన్న ఓ కార్యక్రమంలో చరణ్‌ని న్యూ ఏజ్ మెగాస్టార్ అన్నారు. ఇకపై చరణ్‌ను ముందుంచి నేను వెనుక ఉండటం సరైనది. బిడ్డలు ఎదిగినప్పుడు పొందే ఆనందం అంతా ఇంతా కాదు. 'రంగస్థలం' తర్వాత నేను పొందింది కొంతే, 'పెద్ది' తర్వాత వంద శాతం పుత్రోత్సాహాన్ని ఆస్వాదిస్తున్నానని అన్నారు. 'పెద్ది' సినిమాలోని నటీనటులు, పనిచేసిన సాంకేతిక బృందాన్ని అభినందించారు. బుచ్చిబాబు సానా మాట్లాడుతూ 'తొలి రోజు రామ్‌చరణ్‌కు కథ చెప్పడానికి వెళ్లినప్పుడు 'ఈ పెద్ది పాత్ర అందరూ ఇంటికి తీసుకెళ్లేలా ఉండాలి' అనుకున్నా. రామ్‌చరణ్ తన నటనతో ఆ కథని అందరూ ఇంటికి తీసుకెళ్లేలాగే చేశారు. అందుకు కృతజ్ఞతలు. 'పెద్ది' ద్వితీయార్థంలో ఆయనలోని నటుడు తప్ప మరొకటి కనిపించదు. ఎంతగా ఊహించుకున్నానో, అంతకు పదిరెట్లు ఎక్కువే చేశారు. అందుకు జీవితాంతం రుణపడి ఉంటాను. సుకుమార్ శిష్యుడు అనిపించుకోవడమే నాకు ఇష్టం' అన్నారు. ఈ కార్యక్రమంలో సుకుమార్, అనిల్ రావిపూడి, రవిశంకర్ యలమంచిలి, అనంతశ్రీరామ్, రత్నవేలు, ఇషాన్ సక్సేనా, సాహు గారపాటి, గీత రచయిత బాలాజీ, కాస్ట్యూమ్ డిజైనర్ ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ 'కొన్ని విజయాలు చాలా ఆనందాన్నిస్తాయి. ఈ విజయం నా జీవితాన్ని మార్చేసింది. ఇన్ని సినిమాలకు నాకు వచ్చిన ప్రేమ, అభిమానం వేరు, ఈ సినిమాతో అందరూ చూపించిన అభిమానం వేరు. నా హృదయంలో నిలిచిపోయే విజయాన్నిచ్చారు. రామ్‌చరణ్‌ని మరిచిపోయే పెద్దినే గుర్తు పెట్టుకుంటారేమో అని భయమేస్తోంది. నా ఇంట్లోనే నేనది అనుభవించా. నా కూతురు క్లీంకారా 'పెద్ది' విడుదలయ్యేవరకూ నాన్న నాన్న... అనే పిలిచేది. ఇప్పుడు పెద్ది, పెద్దినాన్న అని పిలుస్తోందని నవ్వుతూ అన్నారు. ఇంత పెద్ద అందమైన జ్ఞాపకాన్ని ఇచ్చిన దర్శకుడు బుచ్చిబాబుకు చాలా కృతజ్ఞతలు. సాంకేతిక బృందం అంతా గొప్పగా పనిచేసిందని అన్నారు.



## వారణాసి షూటింగ్‌కు

# మహేశ్‌బాబు బ్రేక్

### మళ్లీ జూలై1 నుంచి పాల్గొంటారని సమాచారం

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి' సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న మహేష్ బాబు తాజాగా చిన్న విరామం తీసుకుని కుటుంబ సభ్యులతో కలిసి వెకేషన్‌కు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. రీసెంట్‌గా హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మహేష్ బాబు తన భార్య నమ్రత, కుమారుడు గౌతమ్, కుమార్తె సితారలతో కలిసి కనిపించారు. ఎయిర్‌పోర్ట్‌లో కుటుంబంతో కలిసి కనిపించిన వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో 'వారణాసి' షూటింగ్‌కు మహేష్ బాబు తాత్కాలికంగా బ్రేక్ ఇచ్చినట్లు స్పష్టమైంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, మహేష్ బాబు జూలై 1నుంచి మళ్లీ 'వారణాసి' షూటింగ్‌లో పాల్గొననున్నారని తెలుస్తోంది. వరుసగా నెలల తరబడి షూటింగ్‌లో పాల్గొన్న అనంతరం కుటుంబంతో కొంత సమయం గడపాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇక ఈ చిత్రంలో మహేష్ బాబు పాత్రల గురించి వస్తున్న వార్తలు అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ సినిమాలో ఆయన 'రుద్ర' పాత్రలో కనిపించడమే కాకుండా, శ్రీరాముడి పాత్రలో కూడా ద్విపాత్రాభినయం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా యాక్షన్ ఎపిసోడ్లు, అడ్వెంచర్ సన్నివేశాలు సినిమా ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టాక్ వినిపిస్తోంది.




# శ్రద్ధాకపూర్ ప్రధాన పాత్రలో ఈత

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఈత' అధికారిక టీజర్ విడుదలైంది. 'ఛావా' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఈ బయోపిక్ డ్రామాకు దర్శకత్వం వహిస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ జానపద, లావణి నృత్య కళాకారిణి విఠాబాయి నారాయణగాంకర్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. దినేష్ విజన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రణదీప్ హుడా కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా విడుదలైన టీజర్‌లో శ్రద్ధా కపూర్ మునుపెన్నడూ చూడని పాత్రలో కనిపించి ఆకట్టుకున్నారు. గర్భవతిగా ఉండి కూడా స్టేజ్ పై నృత్యం చేయడం, ప్రసవ వేదన అనుభవిస్తూనే కళ కోసం రంగస్థలంపైకి రావడం వంటి భావోద్వేగ సన్నివేశాలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. 'మంచంపై పడి చనిపోతే నన్ను ఒక నిస్సహాయురాలిగా గుర్తుంచు కుంటారు. అదే నృత్యం చేస్తూ చనిపోతే ఒక చరిత్రగా నిలిచిపోతాను' అంటూ శ్రద్ధా కపూర్ చెప్పే డైలాగ్ రోమాలు నిక్కబొడుస్తున్నాయి. ఇక ఈ చిత్రం 2026 ఆగస్టు 28న థియేటర్లలో విడుదల కానుంది. టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది.



# క్లాస్ లుక్‌తో మెరిసిన రీతూ వర్మ

బ్యూటిఫుల్ నటి రీతూ వర్మ 'బాద్ షా' సినిమాలో కాజల్ అగర్వాల్ కి చెల్లెలు పాత్రలో నటించి చైల్డ్ ఆర్టిస్టుగా మెప్పించింది. ఆ తర్వాత ఈమె పెళ్లిచూపులు సినిమాతో హీరోయిన్గా ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ మంచి విజయం సాధించడం, ఇందులో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో ఈ బ్యూటీకి ఈ చిత్రం ద్వారా మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత ఈమె కేవలం తెలుగు చిత్రాలు మాత్రమే కాకుండా పలు ఇతర భాష చిత్రాల్లో కూడా నటించి గుర్తింపును సంపాదించుకుంది. ప్రస్తుతం రీతూ, గోపీచంద్ హీరోగా రూపొందుతున్న భరత వర్ష చిత్రంలో హీరోయిన్గా నటిస్తోంది. ఈ మూవీపై ప్రస్తుతానికి ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా విజయం సాధిస్తే ఈమె క్రేజ్ మరింత పెరిగే అవకాశం ఉంది. సినిమాల్లో భారీగా అందాలను ఆరబోయకుండా క్లాస్,

డీసెంట్ పాత్రలతో ఆకట్టుకుంటున్న ఈ బ్యూటీ సోషల్ మీడియాలో కూడా చాలా తక్కువ శాతం మాత్రమే తన గ్రామర్ ఫోటోలను షేర్ చేస్తూ వస్తుంది. తాజాగా మరోసారి క్లాస్ లుక్ తో ప్రేక్షకులను అలరించింది. స్కై బ్లూ కలర్ శారీ కట్టుకొని, పింక్ కలర్ బ్లౌజ్ ధరించి డిఫరెంట్ యాంగిల్స్ లో ఈ బ్యూటీ ఫోటోలకు పోజులు ఇచ్చింది. ఇందులో ఈమె మెడలో ఒక నక్లెస్ వేసుకొని కురులను అందంగా గాలికి వదిలేసి క్యూట్ స్మైల్ తో ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. మొత్తంగా ఇందులో ఈమె చాలా సూపర్ లుక్ లో ఉండడంతో ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com